# హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in








సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 217 | పేజీలు : 08 | సోమవారం | 17-08-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


# సెప్టెంబరులో శాసనసభ సమావేశాలు పెడుతున్నాం

## కేసీఆర్ అనుభవం, సలహాలు కావాలి : సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ పల్స్,డెస్క్

అన్ని ప్రభుత్వ శాఖల్లో విడతలవారీగా ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామని, విడతలవారీగా ప్రభుత్వ ఉద్యోగాలు చేపట్టే బాధ్యత తనదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. మాయ మాటలు నమ్మి యువత మోసపోవద్దని, పోటీ పరీక్షలకు సన్నద్ధమై భవిష్యత్తును తీర్చిదిద్దుకోండని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటన భాగంగా ములుగు నుంచి హనుమకొండ వచ్చిన రేవంత్ రెడ్డి, పరకాలలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వంద పడకల ఆసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాలను ప్రారంభించారు. రూ.484 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం పరకాలలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో పాల్గొన్నారు.

**ప్రతీ ప్రభుత్వ ఉద్యోగాన్ని భర్తీ చేస్తా**

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, కానిస్టేబుల్ పోస్టులకు విడతలవారీగా నోటిఫికేషన్లు ఇస్తామని, ఖాళీగా ఉన్న ప్రతి ప్రభుత్వ ఉద్యోగాన్ని భర్తీ చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. యువత ఆత్మబలిదానాలు చేసి తెలంగాణ సాధించుకున్నారని అన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ కుటుంబం యువతను రెచ్చగొట్టిందని,



మొన్న తెలంగాణ భవన్‌లో రక్తదాన కార్యక్రమం చేపట్టారని, రక్తదాన కార్యక్రమంలో కేటీఆర్, హరీశ్‌రావు చుక్క రక్తం ఇవ్వలేదని, బీఆర్ఎస్ కార్యకర్తలు రక్తం ఇస్తే అమ్ముకొని కోట్ల రూపాయలు సంపాదించారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

**కేసీఆర్‌ను కూడా తీసుకురావాలి**

కేటీఆర్, హరీశ్‌రావు శాసనసభ సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారని, మీ పాలనపై, కాంగ్రెస్ పాలనపై చర్చిద్దామని రేవంత్ సవాల్ విసిరారు. సెప్టెంబరులో శాసనసభ సమావేశాలు పెడుతున్నామని, కేసీఆర్‌ను కూడా తీసుకురావాలని సూచించారు. సీఎంగా, కేంద్రమంత్రిగా చేసిన కేసీఆర్ అనుభవం, సలహాలు తమకు కావాలని తెలిపారు. అనుభవం లేకపోయినా ఇచ్చిన మాట కోసం అహర్నిశలు కష్టపడుతున్నామని, కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు కట్టాడానికే ఆదాయం సరిపోతోందని రేవంత్ అన్నారు.

**వరంగల్ పోరాటాల గడ్డ**

పరకాలలో ప్రజాపాలన – ప్రగతిబాట కార్యక్రమానికి వేలాదిగా మహిళలు వచ్చారన్న సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రాంత సమస్యల పరిష్కారానికి ఎన్నోసార్లు తనను, మంత్రులను కలిసేవారని గుర్తు చేశారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డి వల్లే ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయని, వరంగల్ పోరాటాల గడ్డ అని సీఎం కొనియాడారు. ఈ ప్రాంతంలో ప్రజలకు చైతన్యం ఉందని, ఆలోచన ఉందన్నారు. యశస్విని 50 వేల ఓట్ల మెజార్టీతో గెలిచారని అభినందించారు.

**కేసీఆర్ రెండుసార్లు మోసం చేశారు**

మట్టిలో కలిసినా, సరే ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రోజుకు 18 గంటలు పని చేస్తున్నామని, 32 నెలల్లో మూడు రోజులైనా సెలవు తీసుకున్నానా అని అడిగారు. రైతు రుణమాఫీ చేస్తానని రెండుసార్లు కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. రైతురుణ విముక్తి కలిగిన రాష్ట్రంగా తెలంగాణను మార్చామని పేర్కొన్నారు.

# హైదరాబాద్ సిటీ పోలీస్‌లో పోస్టులు భర్తీ

## 150 స్పెషల్ పోలీస్ అధికారులకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి?




హైదరాబాద్ పల్స్,డెస్క్

హైదరాబాద్ సిటీ పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 150 స్పెషల్ పోలీస్ ఆఫీసర్ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అధికారులు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. మాజీ సైనికులు, మాజీ పారామిలిటరీ బలగాలు, రిటైర్డ్ పోలీసు సిబ్బంది ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

**150 స్పెషల్ పోలీస్ ఆఫీసర్ పోస్టులు**

నిబంధనల ప్రకారం, హైదరాబాద్ సిటీ పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 150 స్పెషల్ పోలీస్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు మాజీ సైనికుల వయస్సు 58 సంవత్సరాల లోపు ఉండాలి. ఈ నేపథ్యంలోనే రిటైర్డ్ పారామిలటరీ, పోలీసు సిబ్బంది పదవీ విరమణ పొందిన రెండేళ్లలోపు వారై ఉంటేనే అర్హులు. వీరికి గరిష్ట వయోపరిమితి 62 ఏళ్లు ఉంటుంది. ఎంపికైన వారికి నెలకు రూ.26,000 చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తారు.

**అప్లై చేసుకునేందుకు ఈ పత్రాలు తప్పనిసరి**

ఈ ఉద్యోగాలకు ఆసక్తి గల అభ్యర్థులు డిశ్చార్జ్ లేదా రిటైర్మెంట్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకెళ్లాల్సి ఉంటుంది. దీనితోపాటు అప్లై చేసుకునేందుకు ఆధార్, పాన్ కార్డ్, ఎస్‌బీఐ బ్యాంక్ పాస్‌బుక్, ఓటరు ఐడీ, కుల ధృవీకరణ పత్రం, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు అవసరం ఉంటుంది. వీటిలో డ్రైవర్ పోస్టులకు అప్లై చేయాలనుకునేవారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాల ఒరిజినల్, జిరాక్స్ కాపీలను తీసుకువెళ్లాల్సి ఉంటుంది.

**అక్కడే అప్లై చేసుకోవాలి**

దీనికోసం అప్లై చేసుకునేందుకు ఆన్‌లైన్ విధానం అందుబాటులో లేదు. వీటిలో ఆఫ్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి. దీనికోసం అర్హులైన వారు హైదరాబాద్, పెట్లబుర్జ్‌లోని సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్న ఎస్పీవో కార్యాలయాన్ని సందర్శించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు స్వయంగా హాజరై అప్లై చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులు సమర్పించడానికి ఆగస్టు 25వ తేదీ చివరి రోజు. ఆరోజు సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అర్హులైన వారు వీలైనంత త్వరగా అప్లై చేసుకోవాలని అధికాలు విజ్ఞప్తి చేశారు.

# కల్తీకి చెక్ పెట్టేలా కొత్తగా టీజీ సేఫ్

## ఫుడ్‌సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ శాఖల విలీనం

హైదరాబాద్ పల్స్,డెస్క్

తెలంగాణలో ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ వ్యవస్థలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఆహార కల్తీ, డ్రగ్స్ వ్యాపారంపై ఉక్కుపాదం మోపుతామని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన మేరకు తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ – టీజీ సేఫ్‌ను ఏర్పాటు చేసింది.

టీజీ–సేఫ్ కమిషనర్‌గా అవినాష్ మొహంతి

ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌ను విలీనం చేసి టీజీ–సేఫ్‌ను ఏర్పాటుచేసిన ప్రభుత్వం, ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డైరెక్టర్ జనరల్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న అవినాష్ మొహంతిని టీజీ–సేఫ్ కమిషనర్‌గా నియమించింది. ఫుడ్ సేఫ్టీ స్టాండ్ యాక్ట్–2026 ప్రకారం టీజీ–సేఫ్ కమిషనర్ అధికారాలు, విధులు నిర్వహించనున్నారు. ఫుడ్ సేఫ్టీ ఉల్లంఘనలపై మరింత సమన్వయంతో చర్యలు తీసుకునే దిశలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం తెలిపింది.

హెచ్ ఫాస్ట్‌తో పాటు టీజీ సేఫ్!

అధికార యంత్రాంగం ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా ఆహార కల్తీ ఆగడం లేదు. ఇంట్లో వండే ఆహార పదార్థాలే కాదు హోటళ్లలో కూడా కల్తీ



బయటపడుతోంది. ఇటీవల కొన్ని హోటళ్లలో నాలుగైదు రోజులుగా నిల్వ చేసిన మటన్, చికెన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటన్నింటికీ ప్రజల నిర్లక్ష్యం కూడా కొంత కారణం అవుతోంది. ఇటీవల హైదరాబాద్ కాటేదాన్ కేంద్రంగా సాగుతున్న మసాలాల కల్తీ రాకెట్‌ను హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీం బయటపెట్టింది. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు ప్రధాన నిందితులను అరెస్టు చేసి, ఏకంగా 25,300 కిలోల కల్తీ మసాలా దినుసులను స్వాధీనం చేసుకుంది. హైదరాబాద్ నగరంలో పుట్టగొడుగుల్లా కల్తీ ఆహారం పదార్థాల తయారీ కేంద్రాలు వెలిశాయని వీటిపై ఉక్కుపాదం మోపేందుకే సీపీ సజ్జనార్ సూచనతో ‘హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీమ్’ (ఎ–ఫీూూ) ఏర్పాటు చేశారు. దానితో పాటు టీజీ సేఫ్‌ను సైతం ఏర్పాటు చేశారు.

ఆహార భద్రతా ప్రమాణాల చట్టం–2006

స్వాతంత్ర్యం తర్వాత దేశవ్యాప్తంగా ఏకీకృత ఆహార ప్రమాణాలను నిర్దేశించేందుకు ప్రవేశపెట్టిన ఆహార కల్తీ నిరోధక చట్టం–1954 స్థానంలో ప్రవేశపెట్టిన ఆహార కల్తీ నిరోధక చట్టం–2006 ఎఫ్ఎస్ఎస్ఏఐ వంటి సంస్థల ఏర్పాటుకు తోడ్పాటును అందించింది. అధికారులకు తనిఖీలు, నమూనాల సేకరణకు చట్టపరమైన అధికారాలను ఇచ్చింది. అయితే ప్రస్తుతం ఉన్న సవాళ్లను తట్టుకునేందుకు ఈ చట్ట పరిధి సరిపోవడం లేదు. అందువల్ల ఆహార భద్రతా ప్రమాణాల చట్టం–2006ను యథాతథంగా కొనసాగిస్తూనే సంఘటిత రూపం దాల్చిన తీవ్రమైన కేసుల్లో నేర న్యాయవ్యవస్థను మరింత బలంగా అనుసంధానం చేయాలి. డబ్బులకు ఆశపడి విషపూరిత పదార్థాలను ఆహారంలో కలిపి ప్రజల ప్రాణాలను పణంగా పెట్టే కల్తీదారులను కేవలం నాణ్యతా ప్రమాణాల్లో స్వల్ప లోపాలకు బాధ్యులైన సాధారణ విక్రేతలతో చూడరాదు. అందుకు చట్టాలను పటిష్ఠం చేసి కల్తీదారులకు కఠిన శిక్షలు పడేలా చేయాలి.

# హిందువులపై పాక్ అధ్యక్షుడు జర్దారీ వ్యాఖ్యలు..

హైదరాబాద్ పల్స్,డెస్క్



ప్రముఖ కవి, బాలీవుడ్ సినీ గీత రచయిత జావేద్ అక్తర్ మరోసారి పాకిస్థాన్‌పై తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. పాకిస్థాన్‌లోని హిందూ మైనారిటీల గురించి ఆ దేశ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. జర్దారీపై ఉన్న పాత అవినీతి ఆరోపణలను గుర్తుచేస్తూ, ‘మిస్టర్ 10%’ అంటూ ఎద్దేవా చేస్తూ ఆయనకు గట్టి కౌంటర్ ఇచ్చారు.

**అసలేం జరిగిందంటే..**

పాకిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జరిగిన ఒక కార్యక్రమంలో అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ ప్రసంగించారు. దేశంలో 3–4 శాతం ఉన్న హిందూ జనాభాను తాము ‘భరిస్తున్నామని’ (శీశ్రీవతీఫ్వ), వారికి పూర్తి స్వేచ్ఛ ఉందని అన్నారు. భారత్‌తో పోలిస్తే పాకిస్థాన్‌లోనే నివసించడానికి వారు ఇష్టపడతారని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన ‘అఖండ భారత్’ ఆలోచనను కూడా ప్రస్తావించారు. జర్దారీ చేసిన ఈ వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

**జావేద్ అక్తర్ ఘాటు స్పందన**

జర్దారీ వ్యాఖ్యలపై జావేద్ అక్తర్ ‘ఎక్స్’ వేదికగా స్పందించారు. జర్దారీపై గతంలో ఉన్న ‘మిస్టర్ 10%’ అనే అవినీతి ఆరోపణల నిక్‌నేమ్‌ను ప్రస్తావిస్తూ ఓ పోస్ట్ పెట్టారు. “బెనజీర్ భుట్టోను వివాహం చేసుకున్న తర్వాత వెలుగులోకి వచ్చిన పాకిస్థాన్ అధ్యక్షుడు మిస్టర్ జర్దారీ.. తమ దేశంలో 3–4 శాతం ఉన్న హిందూ జనాభాను సహిస్తున్నామని అంటున్నారు. మిస్టర్ జర్దారీ, నాకు అర్థమైంది.. 10 శాతం కంటే తక్కువ ఉన్న దేనినీ మీరు ఎప్పుడూ పట్టించుకోరు కదా” అని జావేద్ అక్తర్ తన పోస్టులో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రభుత్వ ప్రాజెక్టులలో 10 శాతం కమీషన్ తీసుకుంటారనే ఆరోపణలతో జర్దారీకి ‘మిస్టర్ 10%’ అనే పేరు స్థిరపడింది. ఇప్పుడు అదే పేరుతో జావేద్ అక్తర్ విమర్శించడం చర్చనీయాంశంగా మారింది.

## కీటోజెనిక్ డైట్ అంటే ఏమిటి.. భారతీయులకు ఇది సెట్ అవుతుందా..?

కీటోజెనిక్ డైట్.. ప్రస్తుతం బరువు తగ్గాలనుకునే వారిలో బాగా ప్రాచుర్యం పొందిన ఆహార విధానం. హాలీవుడ్, బాలీవుడ్‌కు చెందిన పలువురు సెలబ్రిటీలు తమ శరీర ఆకృతిని మార్చుకోవడానికి ఈ డైట్‌ను అనుసరిస్తున్నట్లు వార్తలు వస్తుంటాయి. అయితే కీటో డైట్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, దుష్ప్రభావాలపై ఇప్పటికీ చర్చ కొనసాగుతోంది. బరువు తగ్గడానికి ఈ డైట్‌ను ప్రారంభించే ముందు దాని గురించి కొన్ని ముఖ్యమైన విషయాలను తెలుసుకోవడం అవసరం. కీటోజెనిక్ డైట్‌లో కార్బొహైడ్రేట్ల పరిమాణాన్ని గణనీయంగా తగ్గించి, కొవ్వుల వినియోగాన్ని పెంచుతారు. సాధారణంగా శరీరం శక్తి కోసం కార్బొహైడ్రేట్లను ఉపయోగిస్తుంది. అయితే కార్బొహైడ్రేట్లు తక్కువగా లభించినప్పుడు శరీరం నిల్వ ఉన్న కొవ్వును శక్తి కోసం ఉపయోగించడం ప్రారంభిస్తుంది. ఈ ప్రక్రియను కీటోసిస్ అంటారు. దీని ద్వారా బరువు తగ్గే అవకాశం ఉంటుందని కీటో డైట్ భావన.

ఏ కొవ్వు పడితే అది కాదు..

అయితే కీటో డైట్‌లో కొవ్వులు ఎక్కువగా తీసుకోవాలంటే ఏ కొవ్వు పడితే అది తీసుకోవచ్చని కాదు. చీజ్, వెన్న, డీప్ ఫ్రైడ్ ఫుడ్స్ వంటి అధిక కొవ్వు, ప్రాసెస్ చేసిన ఆహారాల కంటే అవకాడో వంటి మొక్కల ఆధారిత ఆరోగ్యకరమైన కొవ్వులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు చెబుతున్నారు. అలాగే కీటోజెనిక్ డైట్‌లో చీజ్‌కు కూడా ముఖ్యమైన స్థానం ఉంది. ముఖ్యంగా ఫెటా చీజ్‌ను ఇందులో చేర్చుకోవచ్చు. ఫెటా చీజ్ సాధారణంగా గొర్రె పాలతో తయారు చేసే ఉప్పునీటిలో ఉంచిన పెరుగు చీజ్. అనేక ఇతర రకాల చీజ్‌లతో పోలిస్తే ఇందులో కొవ్వు, కేలరీలు తక్కువగా ఉంటాయి. 100 గ్రాముల ఫెటా చీజ్‌లో సుమారు 21 గ్రాముల కొవ్వు ఉంటుంది. కొవ్వుతోపాటు కాల్షియం, ప్రోటీన్ కూడా ఇందులో లభిస్తాయి. కీటో డైట్‌లో కొవ్వులు, ప్రోటీన్లు అధికంగా ఉండటం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలుగుతుంది. కార్బొహైడ్రేట్లు త్వరగా జీర్ణమై కడుపు ఖాళీ అయ్యే అవకాశం ఉండగా, కొవ్వులు ఎక్కువసేపు జీర్ణమవుతాయి. కొవ్వులు, ప్రోటీన్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల సంతృప్తి భావన ఎక్కువసేపు ఉండి, తద్వారా తక్కువగా తినే అవకాశం ఉంటుంది.

భారతీయులకు సెట్ అవుతుందా..?

అయితే భారతీయుల ఆహార విధానాన్ని దృష్టిలో ఉంచుకుంటే కీటో డైట్‌ను అనుసరించడం అంత సులభం కాదని పేర్కొంటున్నారు. భారతీయులు సాధారణంగా బియ్యం, ఇతర ధాన్యాలు, పప్పులు, కాయధాన్యాలు, మిల్లెట్లు వంటి కార్బొహైడ్రేట్లు అధికంగా ఉండే ఆహారాలపై ఎక్కువగా ఆధారపడతారు. మాంసాహారాన్ని కూడా అధిక పరిమాణంలో తీసుకోవడం సాధారణం కాదు. అందువల్ల భారతీయ ఆహార విధానానికి కీటో డైట్ సరిపోదని పోషకాహార నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కార్బొహైడ్రేట్లను చాలా తక్కువగా తీసుకునే సమయంలో తగినంత ద్రవాలు తీసుకోకపోతే కిడ్నీలో లేదా గాల్‌బ్లాడర్‌లో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. అలాగే ధాన్యాలు, గింజలు, విత్తనాలు, పప్పుధాన్యాలను పూర్తిగా తగ్గించడం లేదా తొలగించడం వల్ల ఫైబర్, కాల్షియం, పొటాషియం, సెలీనియం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన పోషకాలు శరీరానికి తగినంతగా అందవు. అందువల్ల కీటోజెనిక్ డైట్‌ను స్వయంగా ప్రారంభించడం కంటే ముందుగా అర్హత కలిగిన పోషకాహార నిపుణుడిని సంప్రదించడం మంచిది.సరైన ప్రణాళిక లేకుండా లేదా ఎక్కువకాలం పర్యవేక్షణ లేకుండా ఈ డైట్‌ను పాటిస్తే బరువు తగ్గడానికి బదులుగా శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషకాలు లోపించే అవకాశం ఉంటుంది. కాబట్టి వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితి, ఆహారపు అలవాట్లు, శరీర అవసరాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే కీటో డైట్‌ను అనుసరించాలి.



## మీ పిల్లల స్కూల్ బ్యాగ్ బరువు ఎక్కువగా ఉంటే.. ఈ సూచనలు కనిపిస్తాయి..

స్కూల్‌కు వెళ్లే పిల్లల బ్యాగ్‌లో పుస్తకాలు, ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్లు, వాటర్ బాటిళ్లు, లంచ్ బాక్సులు, స్పోర్ట్స్ సామగ్రి వంటి అనేక వస్తువులు చేరుతుంటాయి. ఒక్కో వస్తువు తేలికగానే అనిపించినా, అన్నీ కలిపి బ్యాగ్ బరువు పెరిగితే పిల్లల మెడ, భుజాలు, వెన్నుపై అనవసరమైన ఒత్తిడి పడే అవకాశం ఉంటుంది. పిల్లలు నొప్పి గురించి చెప్పే వరకు వేచి చూడకుండా, బ్యాగ్ బరువు ఎక్కువగా ఉందో లేదో తల్లిదండ్రులు ముందుగానే గమనించడం మంచిది. బ్యాగ్ బరువు ఎక్కువగా ఉన్నప్పుడు పిల్లలు దానిని మోయడానికి ముందుకు వంగడం లేదా నడవడంలో ఇబ్బంది పడటం కనిపిస్తుంది. బ్యాగ్ పట్టీలు భుజాలపై గట్టిగా నొక్కడం, చర్మంలోకి దిగినట్లు కనిపించడం కూడా బరువు ఎక్కువగా ఉందనే సంకేతం అవుతుంది. అయితే పిల్లలు అసౌకర్యం లేదా నొప్పి గురించి చెప్పకపోయినా బ్యాగ్‌ను తేలికగా ఉంచడం అవసరం. భారీ బ్యాగ్ వల్ల తీవ్రమైన వెన్ను గాయాలు సాధారణంగా కనిపించకపోయినా, పిల్లలు బ్యాగ్‌తో నడుస్తూ జారిపడి లేదా పడిపోయినప్పుడు గాయం తీవ్రత పెరిగే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పిల్లల వీపుపై అదనపు బరువు ఉన్నప్పుడు పడిపోవడం మరింత ప్రమాదకరంగా మారుతుంది.

15 శాతానికి మించకూడదు..

పిల్లల బ్యాగ్ బరువు వారి శరీర బరువులో 10 నుంచి 15 శాతానికి మించకూడదనే సూచన తరచూ వినిపిస్తుంది. అయితే పిల్లలందరికీ ఒకే పరిమితిని వర్తింపజేయడానికి తగిన ఆధారాలు లేవని నిపుణులు చెబుతున్నారు. పిల్లల శరీర పరిమాణం, శారీరక బలం, అభివృద్ధి స్థాయి, రోజువారీ కార్యకలాపాలు ఒక్కొక్కరికి భిన్నంగా ఉంటాయి. అందువల్ల సాధ్యమైనంత వరకు బ్యాగ్‌ను తేలికగా ఉంచడం, పిల్లల వ్యక్తిగత అవసరాలను పరిగణనలోకి తీసుకోవడం ముఖ్యం. స్కూల్ నుంచి పుస్తకాలు, ఇతర సామగ్రి తీసుకురావాలనే జాబితా వచ్చినప్పుడు, పిల్లలు ప్రతిరోజూ నిజంగా ఏ వస్తువులు తీసుకెళ్లాల్సిన అవసరం



ఉందో తల్లిదండ్రులు ఒకసారి పరిశీలించాలి. అవసరం లేని వస్తువులను బ్యాగ్‌లో ఉంచకుండా చూడాలి. ట్రెండీగా కనిపించే లేదా అలంకరణ కోసం మాత్రమే ఉపయోగించే వస్తువుల కంటే, తరగతిలో పిల్లలకు నిజంగా అవసరమైన ప్రాథమిక సామగ్రికే ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రస్తుతం పాఠశాలల్లో టెక్నాలజీ వినియోగం పెరగడంతో ల్యాప్‌టాప్‌లు, టాబ్లెట్లు కూడా పిల్లల బ్యాగ్‌లలో భాగమవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో పుస్తకాలతోపాటు ల్యాప్‌టాప్, దాని ఛార్జర్‌ను కూడా ప్రతిరోజూ మోయాల్సి వస్తోంది. ఇంట్లో ఉపయోగించాల్సిన అవసరం లేని రోజుల్లో ల్యాప్‌టాప్‌ను పిల్లలు ఇంటికి తీసుకురాకుండా చూడటం ద్వారా బ్యాగ్ బరువును తగ్గించవచ్చు.

తరచూ పరిశీలించాలి..

పిల్లలు పెద్దయ్యే కొద్దీ స్కూల్ బ్యాగ్‌లో అవసరం లేని వ్యక్తిగత వస్తువులు కూడా చేరే అవకాశం ఉంటుంది. మేకప్ సామగ్రి, నెయిల్ పాలిష్, హెయిర్ డ్రైయర్ వంటి వస్తువులను పిల్లలు బ్యాగ్‌లో ఉంచడం వల్ల అదనపు బరువు చేరుతుంది. అందుకే బ్యాగ్‌లోని వస్తువులను తరచూ పరిశీలించి, అవసరం లేనివాటిని తొలగించడం మంచిది. పిల్లలకు సరైన బ్యాగ్‌ను ఎంచుకోవడం కూడా చాలా ముఖ్యం. పిల్లల శరీరానికి సరిగ్గా సరిపోయే బ్యాగ్‌ను ఎంచుకోవాలి. రెండు వెడల్పాటి, ప్యాడింగ్ ఉన్న భుజాల పట్టీలు, ప్యాడింగ్ ఉన్న వెనుక భాగం, బరువును సమానంగా పంచేలా ఉండే విభాగాలు ఉన్న బ్యాగ్‌లు ఉపయోగకరంగా ఉంటాయి. వీలైతే నడుము లేదా ఛాతీ పట్టీ ఉన్న బ్యాగ్‌ను ఎంచుకోవడం ద్వారా బరువును మరింత సమానంగా పంచవచ్చు. భారీ బ్యాగ్‌ను ఎత్తేటప్పుడు పిల్లలు నడుము నుంచి ముందుకు వంగకుండా మోకాళ్లను వంచి ఎత్తుకునేలా నేర్పించాలి. ఇలా చేయడం వల్ల బరువును ఎత్తే సమయంలో శరీరంపై పడే ఒత్తిడిని తగ్గించవచ్చు. చక్రాలు ఉన్న బ్యాగ్‌లు కొన్ని సందర్భాల్లో, ముఖ్యంగా గాయం నుంచి కోలుకుంటున్న పిల్లలకు ఉపయోగకరంగా ఉంటాయి. అయితే స్కూల్లో మెట్లు ఎక్కువగా ఉంటే లేదా జనసంచారం ఎక్కువగా ఉన్న మార్గాల్లో వాటిని లాగడం వల్ల ఇతరులు తడబడే ప్రమాదం ఉంటుంది. కాబట్టి స్కూల్ వాతావరణాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని బ్యాగ్‌ను ఎంచుకోవాలి.

తరచూ శుభ్రం చేయాలి..

కారు లేదా ఇతర వాహనం ప్రయాణిస్తున్నప్పుడు పిల్లలు బ్యాగ్‌ను వీపుపై వేసుకుని కూర్చోకూడదు. ప్రమాదం లేదా వాహనం అకస్మాత్తుగా ఆగిన సమయంలో బ్యాగ్ ఉండటం సీట్‌బెల్ట్ సరిగ్గా పనిచేయడాన్ని ప్రభావితం చేస్తుంది. అందువల్ల ప్రయాణ సమయంలో బ్యాగ్‌ను పిల్లల పక్కన ఉంచడం సురక్షితం. బ్యాగ్‌ను క్రమం తప్పకుండా శుభ్రం చేయడం కూడా బరువును తగ్గించడానికి ఉపయోగపడుతుంది. పాత నోట్లు, అవసరం లేని పేపర్లు, పూర్తయిన అసైన్‌మెంట్లు, ఖాళీ వాటర్ బాటిళ్లు, ఆహారపు ముక్కలు వంటి వాటిని తొలగించాలి. వారానికి ఒకసారి బ్యాగ్‌ను పూర్తిగా పరిశీలిస్తే అవసరం లేని వస్తువులు పేరుకుపోకుండా చూడవచ్చు. పిల్లల స్కూల్ బ్యాగ్‌లో ప్రతి వస్తువు అవసరమేనా అని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పరిశీలించడం ద్వారా అదనపు బరువును తగ్గించవచ్చు. ముఖ్యంగా పిల్లలు ముందుకు వంగి నడవడం, నడవడంలో ఇబ్బంది పడటం, పట్టీలు భుజాలపై గట్టిగా నొక్కడం వంటి లక్షణాలు కనిపిస్తే బ్యాగ్ బరువును వెంటనే పరిశీలించడం మంచిది.

## కీమోథెరపీ చేయించుకున్న అనంతరం హెయిర్ డైలను వెంటనే ఉపయోగించవచ్చా.. వేచి ఉండాలా..?

కీమోథెరపీ లేదా రేడియేషన్ చికిత్స తర్వాత జుట్టు తిరిగి పెరగడం క్యాన్సర్ నుంచి కోలుకుంటున్న వారికి ఎంతో ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తుంది. జుట్టు మళ్లీ పెరగడం ద్వారా గతంలో కోల్పోయిన సహజ రూపం తిరిగి వస్తోందనే భావన కలుగుతుంది. అయితే కొత్తగా పెరుగుతున్న జుట్టు, దాని కింద ఉన్న చర్మం పూర్తిగా కోలుకునే వరకు హెయిర్ డై వంటి రసాయన ఉత్పత్తులను ఉపయోగించడంలో చాలా జాగ్రత్త అవసరం. ముఖ్యంగా క్యాన్సర్ చికిత్స సమయంలో లేదా చికిత్స పూర్తయిన వెంటనే హెయిర్ డై వాడే ముందు కొన్ని విషయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి. కీమోథెరపీ, రేడియేషన్ వంటి చికిత్సలు శరీరంలో వేగంగా విభజించే కణాలను లక్ష్యంగా చేసుకుంటాయి. క్యాన్సర్ కణాలను నాశనం చేయడంలో ఇవి కీలకంగా పనిచేసినప్పటికీ, ఆరోగ్యకరమైన హెయిర్ ఫోలికల్స్‌పై కూడా ప్రభావం చూపుతాయి. దీంతో జుట్టు పలుచబడటం లేదా పూర్తిగా రాలిపోవడం జరుగుతుంది. చికిత్స తర్వాత జుట్టు తిరిగి పెరగడం ప్రారంభమైనప్పుడు కొత్తగా వచ్చే వెంట్రుకలు, తల చర్మం సాధారణ స్థితితో పోలిస్తే బలహీనంగా, పొడిగా, సున్నితంగా ఉండే అవకాశం ఉంటుంది.

సున్నితంగా మారే చర్మం..

కీమోథెరపీ సమయంలో, అలాగే చికిత్స పూర్తయిన తర్వాత కొన్ని నెలల పాటు తల చర్మం మరింత సున్నితంగా ఉంటుంది. ఈ సమయంలో చర్మంలోని సహజ తేమను కాపాడే పొర కూడా బలహీనపడుతుంది. అందువల్ల సాధారణంగా ఉపయోగించే పర్మనెంట్ హెయిర్ డైల్లో ఉండే కొన్ని ఆల్కలైన్ రసాయనాలు తల చర్మంపై మంట, తీవ్రమైన అలర్జీ, కాంటాక్ట్ డెర్మటైటిస్ వంటి సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉంటుంది. అలాగే కొత్తగా పెరుగుతున్న జుట్టు ఫోలికల్స్‌కు కూడా నష్టం కలిగే ప్రమాదం ఉంటుంది. హెయిర్ డై వాడకం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదంపై కూడా పలు అధ్యయనాలు జరిగాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ సైన్సెస్‌కు చెందిన సిస్టర్ స్టడీలో 35 నుంచి 74 ఏళ్ల మధ్య వయసున్న 46 వేల మందికి పైగా మహిళల సమాచారాన్ని పరిశీలించారు. పర్మనెంట్ హెయిర్ డై, కెమికల్ హెయిర్ స్ట్రెయిటెనర్లను క్రమం తప్పకుండా ఉపయోగించే మహిళల్లో, వాటిని ఉపయోగించని వారితో పోలిస్తే రొమ్ము క్యాన్సర్ ప్రమాదం గణాంకపరంగా కొంత ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనం గుర్తించింది. ముఖ్యంగా పర్మనెంట్ డైలను తరచూ ఉపయోగించేవారిలో ఈ ప్రమాదం ఎక్కువగా కనిపించింది.

దీర్ఘకాలంగా వాడితే..

హార్వర్డ్ టీహెచ్ చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ నిర్వహించిన మరో దీర్ఘకాలిక అధ్యయనంలో 1.17 లక్షల మందికి పైగా మహిళలను 36 ఏళ్ల పాటు పరిశీలించారు. పర్సనల్ హెయిర్ డై వాడకానికి చాలా రకాల క్యాన్సర్లు లేదా మొత్తం క్యాన్సర్ మరణాల మధ్య స్పష్టమైన సంబంధం కనిపించలేదని ఈ అధ్యయనం పేర్కొంది. అయితే దీర్ఘకాలంగా పర్మనెంట్ హెయిర్ డై వాడేవారిలో కొన్ని రకాల బేసల్ సెల్ కార్సినోమాలు, అండాశయ క్యాన్సర్, కొన్ని రకాల రొమ్ము క్యాన్సర్ల ప్రమాదంలో స్వల్ప పెరుగుదల కనిపించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ వ్యక్తిగతంగా హెయిర్ డై వాడటం, వృత్తిపరంగా హెయిర్ డై రసాయనాలకు గురికావడం మధ్య తేడాను పరిశీలించింది. వ్యక్తిగత హెయిర్ డై వినియోగాన్ని ప్రస్తుతం మనుషుల్లో క్యాన్సర్ కారకమా కాదా అని నిర్ధారించలేని గ్రూప్ 3లో ఉంచగా, హెయిర్‌డ్రెస్సర్లు, బార్బర్లు వంటి వృత్తిపరంగా రసాయనాలకు గురయ్యే వారికి సంబంధించిన ఎక్స్‌పోజర్‌ను బహుశా క్యాన్సర్ కారకమైనదిగా గ్రూప్ 2ఎలో వర్గీకరించింది. క్యాన్సర్ చికిత్స తర్వాత హెయిర్ డై ఉపయోగించాలని అనుకునేవారు ఉత్పత్తిలోని పదార్థాల జాబితాను జాగ్రత్తగా పరిశీలించాలి. ముఖ్యంగా పారా-ఫెనిలీన్ డయామైన్ (పీపీడీ), అమ్మోనియా, హైడ్రోజన్ పెరాక్సైడ్ వంటి రసాయనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. పీపీడీ సాధారణంగా ముదురు రంగు పర్మనెంట్ డైల్లో కనిపిస్తుంది. ఇది కొందరిలో తీవ్రమైన అలర్జిక్ రియాక్షన్లకు కారణం అవుతుంది.

తల చర్మంపై ప్రభావం చూపే అమ్మోనియా..

అమ్మోనియాను జుట్టు క్యూటికల్‌ను విప్పి డై లోపలికి వెళ్లేలా చేయడానికి ఉపయోగిస్తారు. అయితే ఇది తల చర్మాన్ని మరింత పొడిగా చేయడంతోపాటు శ్వాసకోశంలో కూడా ఇబ్బందులు కలిగిస్తుంది. హైడ్రోజన్ పెరాక్సైడ్ బ్లీచింగ్, పర్మనెంట్ హెయిర్ కలరింగ్‌లో ఉపయోగిస్తారు. ఇది కొత్తగా పెరిగిన జుట్టులోని తేమ, నిర్మాణాత్మక ప్రోటీన్లను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. అలాగే కొన్ని డైల్లో ఉండే పారాబెన్లు, థాలేట్లు వంటి పదార్థాలను స్వల్పంగా ఎండోక్రైన్ వ్యవస్థపై ప్రభావం చూపే రసాయనాలుగా పరిగణిస్తున్నారుఉ. హెయిర్ డై ఎప్పుడు ఉపయోగించాలనే విషయంలో సమయం చాలా ముఖ్యమైనది. సాధారణంగా కీమోథెరపీ పూర్తయిన తర్వాత కనీసం ఆరు నెలల వరకు పర్మనెంట్ హెయిర్ డైకి దూరంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కొత్తగా పెరుగుతున్న జుట్టు బలపడటానికి, తల చర్మం సాధారణ స్థితికి రావడానికి కొంత సమయం అవసరం. తలకు నేరుగా రేడియేషన్ చికిత్స తీసుకుంటున్నవారు లేదా చికిత్స సమయంలో స్కాల్ప్ కూలింగ్ ఉపయోగిస్తున్నవారు వైద్య బృందం స్పష్టమైన అనుమతి ఇచ్చే వరకు హెయిర్ డైని పూర్తిగా నివారించడం మంచిది. చికిత్స పూర్తయిన మొదటి ఆరు నెలల్లో కెమికల్ హెయిర్ డైలకు దూరంగా ఉండి, తల చర్మాన్ని తేమగా, ఆరోగ్యంగా ఉంచడంపై దృష్టి పెట్టాలి. ఆరు నెలల తర్వాత కూడా డై వాడే ముందు వైద్యుడిని సంప్రదించి తల చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని



పరిశీలించుకోవడం మంచిది. ఏదైనా హెయిర్ కలరింగ్ ఉత్పత్తిని ఉపయోగించే ముందు కనీసం 48 గంటల ముందుగా ప్యాచ్ టెస్ట్ చేయడం కూడా అవసరం.

ప్రత్యామ్నాయాలు ఇవిగో..

క్యాన్సర్ చికిత్స తర్వాత జుట్టుకు రంగు వేసుకోవాలనుకునేవారికి కొన్ని ప్రత్యామ్నాయాలు కూడా ఉన్నాయి. స్వచ్ఛమైన హెన్నా, ఇండిగో, క్యాసియా వంటి సహజ మొక్కల పొడులతో తయారైన హెర్బల్ డైలను పరిగణించవచ్చు. అయితే ఇవి నిజంగా సహజమైనవేనా, వాటిలో సింథటిక్ పీపీడీ లేదా మెటాలిక్ సాల్ట్స్ వంటి అదనపు పదార్థాలు లేవా అనే విషయాన్ని తప్పనిసరిగా తనిఖీ చేయాలి. అమ్మోనియా, హైడ్రోజన్ పెరాక్సైడ్ లేని సెమీ పర్మనెంట్ కలరెంట్లు కూడా ఒక ప్రత్యామ్నాయంగా ఉంటాయి. ఇవి సాధారణంగా జుట్టు ఉపరితలంపై రంగును జమ చేస్తాయి. త్వరగా గ్రే రూట్స్‌ను కవర్ చేయాలనుకునేవారు రూట్ పౌడర్లు లేదా కలర్ మస్కారాలను ఉపయోగించవచ్చు. ఇవి ఒక్కసారి షాంపూ చేసినప్పుడు తొలగిపోతాయి కాబట్టి ఎక్కువకాలం రసాయనాలకు గురికావాల్సిన అవసరం ఉండదు. హెయిర్ కలరింగ్ ఉత్పత్తిని ఉపయోగించే ముందు చెవి వెనుక భాగంలో లేదా మోచేయి లోపలి భాగంలో కొద్దిగా అప్లై చేసి 48 గంటల పాటు గమనించాలి. ఎర్రగా మారడం, దురద, వాపు, మంట వంటి లక్షణాలు కనిపిస్తే ఆ ఉత్పత్తిని ఉపయోగించకూడదు. సాధ్యమైనప్పుడు తల చర్మానికి నేరుగా డై తగలకుండా హైలైట్స్ లేదా బాలయాజ్ వంటి పద్ధతులను కూడా పరిగణించవచ్చు. క్యాన్సర్ చికిత్స తర్వాత సాధారణ హెయిర్ కేర్ రొటీన్‌కు తిరిగి రావడం ఒక సంతోషకరమైన దశే అయినప్పటికీ, తొందరపడకుండా జాగ్రత్తగా ముందుకు వెళ్లడం ముఖ్యం. ముఖ్యంగా పర్మనెంట్ హెయిర్ డై వాడే ముందు కనీసం ఆరు నెలలు వేచి ఉండటం, రసాయన రహిత లేదా సున్నితమైన ప్రత్యామ్నాయాలను పరిగణించడం, అలాగే చికిత్సను పర్యవేక్షిస్తున్న వైద్య బృందాన్ని సంప్రదించడం ద్వారా తల చర్మం, కొత్తగా పెరుగుతున్న జుట్టు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

# సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయం

## పెద్దకంజర్లలో సోలార్ వీధి దీపాలు ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్‌చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 16:** గ్రామాల అభివృద్ధికి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) అన్నారు.ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని పెద్దకంజర్ల గ్రామంలో 2వ వార్డు కౌన్సిలర్ సారా లావణ్య లక్ష్మణ్ ఆధ్వర్యంలో రూ.3 లక్షల సొంత నిధులతో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ దీపాలు, స్తంభాలను శనివారం రాత్రి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంద్రేశం



మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డు అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి కౌన్సిలర్ సొంత నిధులతో సోలార్ వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రశంసించారు. ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఊర్మిల వెంకటరెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు నసీమా బేగం, నవాబ్ సల్మాన్, సీనియర్ నాయకులు రామచందర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు చేసి.. పీఆర్సీ ప్రకటించాలి

**ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి: పీఆర్టీయూ సబ్‌యూనిట్ సమావేశం**

**మహబూబాబాద్ జిల్లా / హైదరాబాద్ పల్స్ । ఆగస్టు 16:** ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని పీఆర్టీయూ సబ్‌యూనిట్ సమావేశం డిమాండ్ చేసింది. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వెంపటి సీతారాములు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై నాయకులు చర్చించారు. ఉద్యోగుల భవిష్యత్తుకు భద్రత కల్పించేందుకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అధ్యక్షుడు వెంపటి సీతారాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.2023 జూలై నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, ఆర్‌డీఏలను కూడా తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను కేవలం హామీలకే పరిమితం చేయకుండా, వాటి పరిష్కారానికి స్పష్టమైన చర్యలు చేపట్టాలని సమావేశం డిమాండ్ చేసింది.ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, భవిష్యత్తు భద్రత కోసం పీఆర్టీయూ ఆధ్వర్యంలో పోరాటాన్ని



వెంపాటి సీతారాములు
(అధ్యక్షులు)



ఎ. శివ ప్రసాద్
(ప్రధాన కార్యదర్శి)

మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎ. శివప్రసాద్‌తో పాటు తుడి వెంకటేష్, మధుసూదన్‌రెడ్డి, మాధవాచారి, శ్యామలాదేవి, మమత, సారంగం ఉమేష్, రంగనాయక, లావణ్య, నరేందర్, దేవేందర్, నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చినహామీ నెరవేర్చిన సర్పంచ్..

**రాయికోడ్, ఆగస్టు 16:** ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుని మాట నిలబెట్టుకున్న సర్పంచ్ గా మామిడిపల్లి సర్పంచ్ ప్రశంసలు అందుకుంటున్నారు.రాయికోడ్ మండలంలోని మామిడిపల్లి గ్రామ సర్పంచ్ షబానా నాజ్ మహబూబ్ పటేల్ సర్పంచ్ ఎన్నికల్లో గ్రామ ప్రజలకు పలు హామీలు ఇచ్చారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు.ఇచ్చిన హామీలో భాగంగా గ్రామంలోని 6వ వార్డులో బోరు వేయించారు. నీటి లభ్యత పుష్కలంగా ఉండటంతో ఆదివారం గ్రామ పెద్దల సమక్షంలో మోటారు బిగించి నీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ షబానా నాజ్ మహబూబ్ పటేల్ మాట్లాడుతూ, సింగిల్ ఫేజ్ మోటారు ఏర్పాటు చేయడం వల్ల గ్రామ ప్రజలకు నిరంతరంగా తాగునీటి సౌకర్యం ఉంటుందని తెలిపారు.గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సర్పంచ్ మహబూబ్ పటేల్ ను గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు. అలాగే బోరు పాయింట్ ను



గుర్తించిన అంజాద్ ను సర్పంచ్ మహబూబ్ పటేల్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సలీం, ఫీల్డ్ అసిస్టెంట్ అల్తాఫ్, నాయకులు భీమ్ రావు, హాసన్ పటేల్, ఫక్రొద్దీన్, షేరీ పాషా తదితరులు పాల్గొన్నారు.

# పవిత్రమైన ఆగస్టు 15న పచ్చి అబద్ధాలు

**సీఎం రేవంత్ పై నరోత్తం ఫైర్**

**జహీరాబాద్,ఆగస్టు 16, హైదరాబాద్ పల్స్ న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి స్వాతంత్ర్య దినోత్సవం రోజున జిల్లాకు వచ్చి, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోకుండా, కేవలం బీఆర్ఎస్ పార్టీపై, మాజీ మంత్రి హరీష్ రావుపై నిందలు వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వై. నరోత్తం విమర్శించారు.వర్షాలు పడకూడదని, కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవాలని క్షుద్రపూజలు చేశారని ముఖ్యమంత్రి నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను క్షుద్రపూజలు కాదు, ప్రజలు ఓట్లతో ఎన్నుకుంటారని, ప్రజల తీర్పుతోనే ప్రభుత్వాలు ఏర్పడతాయని అన్నారు. క్షుద్రపూజల వల్ల ప్రభుత్వాలు వస్తాయన్నట్లు మాట్లాడటం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని, అది ముఖ్యమంత్రి స్థాయికి తగదన్నారు. క్షుద్రపూజల వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందా, మీరు ముఖ్యమంత్రి అయ్యారా అనే అనుమానం ప్రజలకు కలుగుతోందని ఎద్దేవా చేశారు.ముఖ్యమంత్రి జిల్లాకు వస్తున్నాడని, జిల్లాకు మేలు జరుగుతుందని ప్రజలు భావించారని, కానీ పచ్చి అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేయడానికే ప్రయత్నించడం కాంగ్రెస్ సంస్కృతికి నిదర్శనమని విమర్శించారు.జిల్లాలోని రోడ్లు, తాగునీరు, పెండింగ్ ప్రాజెక్టులు, అభివృద్ధి గురించి నిధులు మంజూరు చేస్తే ప్రజలకు మేలు జరిగేదని, ప్రజలు సంతోషించేవారని అన్నారు. సింగూర్ ప్రాజెక్టులోని నీటిని పూర్తిగా దిగువకు వదిలిపెట్టడం వల్ల భూగర్భ జలాలు తగ్గిపోయాయని, ఇలాంటి సమయంలో రైతుల సమస్యలు, సాగునీటి పరిస్థితి, సింగూర్ ప్రాజెక్టు భవిష్యత్తు, భూగర్భ జలాల పరిస్థితిపై మాట్లాడకుండా రాజకీయ ఆరోపణలు చేయడం చూస్తే ప్రజలు, రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోందన్నారుగతంలో ముఖ్యమంత్రి జహీరాబాద్ వచ్చినప్పుడు నిమ్జ్ లో భూములు కోల్పోయిన రైతులకు పట్టణంలో 5,000 ప్లాట్లు ఇస్తామని చెప్పి, బాధ్యతను జగ్గారెడ్డికి అప్పగించారని, అది నేటికీ నెరవేరలేదని గుర్తుచేశారు. జహీరాబాద్-నారాయణఖేడ్ ప్రాంత రైతుల కోసం 3 లక్షల ఎకరాలకు నీరందించే సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేస్తే, నేటి వరకు దాన్ని మొదలుపెట్టలేదని, మన ప్రాంతానికి చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు మంజూరు చేయలేదని, జహీరాబాద్, సంగారెడ్డి అభివృద్ధిపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలని డిమాండ్




చేశారు.మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతి నెలా రూ. 2,500 ఇస్తామని చెప్పి 32 నెలలు గడుస్తున్నా ఒక్కరికీ ఇవ్వలేదని, ఈ లెక్కన ప్రతి మహిళకు ముఖ్యమంత్రి రూ. 80 వేలు బాకీ పడ్డాడని అన్నారు.గత రెండున్నరేళ్లుగా ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వకుండా 30 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారని, రైతుబంధు నిధులు ఇవ్వకుండా రైతులను, అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. పవిత్రమైన ఆగస్టు 15 రోజున ఇలా పచ్చి అబద్ధాలు, చిల్లర మాటలు మాట్లాడిన దేశంలో ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని విమర్శించారు. ఇలాంటి చిల్లర మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ప్రజలు త్వరలోనే బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, శివకుమార్, వై. గోపాల్, సి.ఎం. విష్ణువర్ధన్ రెడ్డి, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# బొల్లారంలో అమ్మ వారి బోనాల పండుగ

**ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో ఎంపీ ఈటల, మాణిక్ రెడ్డి**



**ఆగస్టు 16, బొల్లారం, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని బొల్లారంలో బోనాల పండుగ సందర్భంగా అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతల మాణిక్ రెడ్డి, సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, సుధీర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆపన్న కుటుంబానికి సర్పంచ్ వినోద్ నాయక్ ఆర్థిక చేయూత



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 16, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** డోర్నకల్ మండలం రాముతండాకు చెందిన తేజావత్ వర్ధన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఆదివారం నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ వినోద్ నాయక్ హాజరై వర్ధన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన సర్పంచ్ వినోద్ నాయక్ వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వర్ధన్ చిన్న వయసులోనే మృతి చెందడం కుటుంబానికే కాకుండా గ్రామానికి కూడా తీరని లోటని పేర్కొన్నారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దశదిన కర్మ కార్యక్రమం ఖర్చుల కోసం తనవంతు సహాయంగా రూ.2,000 ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్తులోనూ అవసరమైన సమయంలో కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బానోత్ రాందాస్, వార్డు సభ్యులు భూక్యా మంగు, లకావత్ వెంకన్న, వీరు, గుగులోత్ మోహన్, యువ నాయకుడు నునావత్ సాయి, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కార్యకర్తల మధ్య ఘనంగా మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 16, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ మాజీ శాసన సభ్యురాలు, మాజీ ప్రభుత్వ విప్ శ్రీమతి గొంగిడి సునీత మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం యాదగిరిగుట్టలో నియోజకవర్గ కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి గొంగిడి సునీత మహేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆమె ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్ల ప్రజాసేవలో కొనసాగాలని కార్యకర్తలు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు గంగాధరి సుధీర్ కుమార్, జివిలకపల్లి సత్యనారాయణ, శనిగరం హరీష్, గంగాధరి సత్తయ్య, గంగాధరి సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజపేటలో ఘనంగా మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత జన్మదిన వేడుకలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 16, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేటలో మండల కేంద్రంలో రాజపేట బిఆర్ఎస్ మండల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా మాజీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజపేట బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ మాట్లాడుతూ.. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ప్రియతమ నాయకురాలు, ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా రాజపేట గాంధీ చౌరస్తాలో కేక్ కట్ చేయడం జరిగిందనీ తదనంతరం హాస్పటల్లో పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించామాని అన్నారు. గొంగిడి సునీత మహేందర్ రెడ్డి నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భాగవతున్ని ప్రార్థిస్తూన్నమాని అన్నారు. కార్యక్రమంలో మండలంలోని నాయకులు మండల పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, జలసాధన సమితి అధ్యక్షులు ఎర్రగోకుల జశ్వంత్, మహిళా పార్టీ అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, పార్టీ సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్ గౌడ్, మహిళా నాయకురాలు రమాదేవి, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ కాకల్ల ఉపేందర్, డైరెక్టర్ నాగరాజ్, కూతురు లింగం, భోగ హరినాథ్, యాదగిరి గౌడ్, వెంకన్న బొంగోనీ ఉప్పలయ్య, కరీం, గోపిరెడ్డి, మొగిలి నాగరాజ్, ఎమ్మా భాస్కర్, గంధమల్ల సురేష్, బాలకృష్ణ, చెరుకు కనకయ్య, రాములు నాయక్, లక్ష్మణ్ నాయక్, బోనాల వెంకటేష్, కరుణాకర్ రెడ్డి, నరసింహారెడ్డి, బొందుగుల ఉపసర్పంచ్ ఎండి ఆబిద్ ఉపేందర్, ఉప్పలయ్య, కిష్టయ్య, రమేష్, ఉప సర్పంచ్ రాజు మనోహర్ తదితరులు పాల్గొన్నారు

# నేతన్నలకు శుభవార్త.. రూపాయి చెల్లించకుండానే రూ.5 లక్షల బీమా

**'నేతన్న భద్రత' పథకానికి దరఖాస్తుల స్వీకరణ.. ఈ నెల 18వ తేదీతో గడువు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 16, తెలంగాణ బ్యూరో :** చేనేత, మరమగ్గాల కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. చేనేత, పవర్‌లూమ్ రంగాల్లో పనిచేసే కార్మికులతో పాటు వస్త్ర పరిశ్రమ అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న వారికి 'నేతన్న భద్రత' పథకం ద్వారా రూ.5 లక్షల బీమా సదుపాయం కల్పిస్తోంది. ఈ పథకంలో చేరేందుకు కార్మికులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుంది. పథకానికి అర్హత పొందిన కార్మికుడు ఏ కారణంతోనైనా మరణిస్తే, కుటుంబానికి రూ.5 లక్షల బీమా సాయం అందించేలా పథకాన్ని అమలు చేస్తున్నారు.

**వీరికి అర్హత**



చేనేత మగ్గాలు నడిపే కార్మికులు, పవర్‌లూమ్ కార్మికులు ఈ పథకానికి అర్హులు. అదేవిధంగా వస్త్ర పరిశ్రమకు అనుబంధంగా పనిచేసే డయింగ్, డిజైనింగ్, వార్పింగ్, వైండింగ్, సైజింగ్, వైపింగ్, రోలింగ్ (గమ్మింగ్), డ్రాయింగ్, బ్లీచింగ్ తదితర విభాగాల కార్మికులు కూడా పథకంలో చేరేందుకు అవకాశం ఉంది.

**18వ తేదీలోగా దరఖాస్తు**

అర్హులైన కార్మికులు ఈ నెల 18వ తేదీలోగా తెలంగాణ రాష్ట్రంలోని సంబంధిత చేనేత, జౌళి శాఖ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. దరఖాస్తు సమయంలో అవసరమైన గుర్తింపు పత్రాలు, ఇతర సంబంధిత ధ్రువపత్రాలను వెంట తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. గడువు సమీపిస్తున్నందున అర్హులైన నేతన్నలు, వస్త్ర పరిశ్రమ కార్మికులు ఆలస్యం చేయకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. నేతన్న భద్రత పథకం ద్వారా ఆకస్మిక మరణం సంభవించిన సమయంలో కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం.

# కాంగ్రెస్ నేతలూ.. సిగ్గుపడండి: అమిత్ షా

**'వందేమాతరం' గీతాన్ని అవమానించారంటూ కాంగ్రెస్‌పై కేంద్ర హోంమంత్రి తీవ్ర విమర్శలు**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 16, సెంట్రల్ డెస్క్:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో 'వందేమాతరం' గీతాలాపన అంశంపై రాజకీయ వివాదం నెలకొంది. ఈ వ్యవహారంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.రాజస్థాన్‌లోని చిత్తౌడ్‌గఢ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడుతూ.. ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో 'వందేమాతరం' గీతాన్ని ఆలపిస్తున్న సమయంలో మధ్యలోనే ఆపేయాలని సోనియా గాంధీ పార్టీ అధ్యక్షుడికి సూచించారని ఆరోపించారు.కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం జాతీయ గేయాన్ని అవమానించారని అమిత్ షా విమర్శించారు. కాంగ్రెస్



నేతలు ఈ ఘటనపై సిగ్గుపడాలని వ్యాఖ్యానించిన ఆయన.. సోనియా గాంధీ దేశ ప్రజలకు, 'వందేమాతరం' రచయిత బంకిం చంద్ర ఛటర్జీకి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ ఖండన:**

అమిత్ షా ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో 'వందేమాతరం' గీతాన్ని పూర్తిగా ఆలపించామని కాంగ్రెస్ స్పష్టం చేసింది.కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ.. సోనియా గాంధీ 'వందేమాతరం' గీతాన్ని ఆపాలని ఎలాంటి సూచన చేయలేదన్నారు. కొంతసేపటి నుంచి నిలబడి ఉన్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కోసం కుర్చీ ఏర్పాటు చేయాలని మాత్రమే ఆమె కార్యకర్తలకు సూచించారని వివరణ ఇచ్చారు.బీజేపీ ఈ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకుంటోందని జైరాం రమేష్ విమర్శించారు. దీంతో 'వందేమాతరం' గీతాలాపన అంశంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ వాగ్వాదం కొనసాగుతో

# సెలవుపై ఇంటికి వచ్చిన ఆర్మీ జవాన్.. భార్యను కొట్టి హత్య..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, పంజాబ్, ఆగస్టు 16:**

పంజాబ్‌లోని హోషియార్‌పూర్ జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. సెలవుపై ఇంటికి వచ్చిన ఓ ఆర్మీ జవాన్ కుటుంబ కలహాల నేపథ్యంలో తన భార్యను తీవ్రంగా కొట్టి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటనను ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు కూడా పోలీసులు వెల్లడించారు.హాజీపూర్ సమీపంలోని సునేహ్రా గ్రామంలో ఈ ఘటన జరిగింది. మృతురాలిని రమగా గుర్తించారు. ఆమె భర్త అమర్‌జిత్ సింగ్ ఆర్మీలో పనిచేస్తున్నాడు. ఆగస్టు 13న సెలవుపై ఇంటికి వచ్చిన అమర్‌జిత్‌కు భార్య రమతో గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆమెపై తీవ్రంగా దాడి చేయడంతో మృతి చెందినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.అయితే ఘటనను కప్పిపుచ్చేందుకు రమ ఇంటి పైకప్పు నుంచి ప్రమాదవశాత్తు కిందపడిందని కుటుంబ సభ్యులను నమ్మించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు తెలిపారు. తెల్లవారుజామున ఆమెను హాజీపూర్ ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.రమ శరీరంపై తీవ్ర గాయాలు కనిపించడంతో కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు భర్త అమర్‌జిత్ సింగ్‌తో పాటు అతనికి సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కుల్దీప్ అలియాస్ కుకీ, సోనియాలపై కేసు నమోదు చేశారు.వివాహం జరిగినప్పటి నుంచి రమను వేధింపులకు గురిచేస్తున్నారనే



ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ దంపతులకు ఎనిమిదేళ్ల కుమారుడితో పాటు ఓ కుమార్తె ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ప్రధాన నిందితుడు అమర్‌జిత్ సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. హత్యకు దారితీసిన పూర్తి కారణాలు, ఇతర నిందితుల పాత్రపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్ పల్స్

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం

**పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**




**ఆగష్టు 16, బంజారాహిల్స్,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ లోని కొమరం భీం ఆదివాసీ భవన్ లో నిర్వహించిన హైదరాబాద్ జిల్లా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజహరుద్దీన్, ఎంపీ అనీల్ కుమార్ యాదవ్, సహచర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

# కంటోన్మెంట్లో వివిధ అమ్మ వారి ఆలయాల్లో శ్రావణ మాస బోనాలు

**పాల్గొన్న ఎంపీ ఈటల, నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మాద మల్లికార్జున్.**



**ఆగష్టు 16, బాలంరాయి,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** శ్రావణ మాస బోనాల పండుగ సందర్భంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ లోని బాలంరాయి దండు మారమ్మ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న స్థానిక పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మరియు కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద మల్లికార్జున్ అనంతరం కంటోన్మెంట్ వార్డ్ 3 లోని కార్ఖానా, సిక్కు విలేజ్, అంబేద్కర్ నగర్ మరియు వార్డ్ 6లోని తాడు బంద్ ముత్యాలమ్మ ఆలయంలో మరియు వివిధ అమ్మవారి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బానుక నర్మద మల్లికార్జున్. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు, మహంకాళి జిల్లా ఉపాధ్యక్షులు బి.ఎన్. శ్రీనివాస్ మరియు బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు మహిళా మోర్చా నాయకురాళ్లు పాల్గొన్నారు.

# టీఎంసీ కార్యాలయంలో మాజీ డిప్యూటీ స్పీకర్ అనుమానాస్పద మృతి.!



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 16, పశ్చిమ బెంగాల్ :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సీనియర్ నేత ఆశిష్ బెనర్జీ (73) అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. బీర్భూమ్ జిల్లా రాంపూర్‌హాట్‌లోని టీఎంసీ పార్టీ కార్యాలయంలో ఆయన మృతదేహాన్ని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పార్టీ కార్యాలయంలో సూసైడ్ నోట్ లభించినట్లు సమాచారం. అయితే ఆయన మృతికి సంబంధించిన పూర్తి కారణాలు అధికారిక దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

**ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం**

ఆశిష్ బెనర్జీ రాంపూర్‌హాట్ నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వంలో విద్య, వ్యవసాయ శాఖలకు మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా సేవలందించారు.సీనియర్ నేత ఆకస్మిక మృతితో టీఎంసీ శ్రేణుల్లో విషాదం నెలకొంది. ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. మృతికి గల పూర్తి కారణాలు, ఇతర అంశాలపై దర్యాప్తు పూర్తయిన తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## సికింద్రాబాద్ లో అటల్ బిహారీ వాజపేయి 8వ వర్ధంతి

### వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన భానుక నర్మదా మల్లికార్జున్.



**ఆగష్టు 16, సికింద్రాబాద్, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** భారతరత్న, మాజీ ప్రధానమంత్రి శ్రీ అటల్ బిహారీ వాజపేయి వర్ధంతి సందర్భంగా ఆదివారం రోజు సికింద్రాబాద్ కంటోన్మెంట్ పికెట్‌లోని అటల్ బిహారీ వాజపేయి పార్కో ఆయన విగ్రహానికి కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లిఖార్జున్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భానుక నార్మద మల్లికార్జున్ మాట్లాడుతూ, దేశం కోసం అటల్ బిహారీ వాజపేయి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. దేశ అభివృద్ధి, జాతీయ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి, త్యాగాలు దేశ ప్రజలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని కొనియాడారు. భారతదేశాన్ని ప్రపంచ వేదికపై బలమైన దేశంగా నిలిపేందుకు వాజపేయి చేసిన కృషిని దేశ ప్రజలు ఎన్నటికీ మరువరని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, వార్డు అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అటల్ బిహారీ వాజపేయికి ఘన నివాళు లర్పించారు.

## రిపోర్టర్ దుగ్యాల రవికుమార్ దశదినకర్మలో పాల్గొన్నా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 16, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి** : యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి, ఇటీవల మృతిచెందిన సాక్షి రిపోర్టర్ దుగ్యాల రవికుమార్ దశదినకర్మ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుగ్యాల రవికుమార్ మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రవికుమార్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టుగా సమాజానికి సేవలందించిన దుగ్యాల రవికుమార్ మృతి బాధాకరమని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబసభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని దేవుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, రవికుమార్ కుటుంబసభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

### రష్యాపై భారీ డ్రోన్ దాడి..

## ఆరుగురు మృతి

క్రెమ్లిన్ : రష్యా– ఉక్రెయిన్ మధ్య యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఎన్నడూ లేనంతగా ఆదివారం రష్యాపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడి చేసింది. ఈ దాడుల్లో ఆరుగురు మృతి చెందారని, మాస్కో సమీపంలోని రష్యన్ ఈ కామర్స్ కంపెనీ 'వైల్డ్ బెర్రీస్'కు చెందిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం సంభవించిందని సమాచారం. ఈ దాడి దరిమిలా ఆకాశంలో నల్లటి పొగలు ఎగసిపడ్డాయి. గత 24 గంటల్లో తొమ్మిది ఉక్రెనియన్ క్రూయిజ్ క్షిపణులను, మొత్తం 1,478 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ శాఖ తెలిపింది. మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ మాట్లాడుతూ రాజధానిపై దాదాపు 600 డ్రోన్లను ప్రయోగించారని, గత రెండేండ్లలో మాస్కోపై జరిగిన అతిపెద్ద వైమానిక దాడి ఇదేనని పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఉక్రెయిన్ తన సుదూర డ్రోన్, క్షిపణి సామర్థ్యాలను మరింతగా విస్తరించింది. దీంతో ఇప్పుడు రష్యా భూభాగంలోని 1,500 మైళ్ల దూరం వరకూ గల లక్ష్యాలను ఛేదించగలదు.

## కౌసల్యాదేవిపల్లిలో భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ తల్లి బోనాలు

**నర్సింహులపేట / హైదరాబాద్ పల్స్ । ఆగస్టు 16:** గ్రామ ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను కౌసల్యాదేవిపల్లి గ్రామంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పండుగను పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే ముత్యాలమ్మ తల్లి ఆలయాన్ని రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మహిళలు కొత్త దుస్తులు ధరించి, పసుపు, కుంకుమలతో అలంకరించిన బోనం కుండలను తలపై పెట్టుకుని మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనాలు



సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ బోనాల వేడుకల్లో గ్రామ



సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతం చేశారు.

## పి.ఎల్.సి. ఫార్మ్ ల్యాండ్ అంతా బోగస్‌నా?

### గుట్టలను ఆక్రమించి 'ఫార్మ్ ల్యాండ్' పేరుతో ప్రజలకు ఎరవేస్తున్నారు.

### నారాయణఖేడ్ బీఎస్పీ అధ్యక్షుడు ఎనుముల తుకారాం

**నారాయణఖేడ్, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 16:** నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తి గంగారాం తండా సమీపంలో గుట్టలను ఆక్రమించి నిర్మించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పి.ఎల్.సి. ఫార్మ్ ల్యాండ్ వ్యవహారంపై నారాయణఖేడ్ బీఎస్పీ అధ్యక్షుడు ఎనుముల తుకారాం తీవ్ర ఆరోపణలు చేశారు. ఆదివారం ఆయన ఫార్మ్ ల్యాండ్ ప్రాంతాన్ని సందర్శించి, అక్కడికి వచ్చిన కొనుగోలుదారులతో మాట్లాడారు. ప్రజలను ఆకర్షించే విధంగా వివిధ పేర్లు, హామీలతో భూములను విక్రయిస్తూ మోసం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఫార్మ్ ల్యాండ్‌లో గుంటల చొప్పున భూములను విక్రయిస్తూ, రైతుబంధు, రైతుబీమా వంటి ప్రభుత్వ పథకాల పేర్లతో కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారని విమర్శించారు. సంబంధిత భూములు గుట్టలపై ఉన్నాయని, అక్కడ సాగునీటి వనరులు అందుబాటులో లేకపోయినా చెట్లు పెంచి భవిష్యత్తులో భారీ లాభాలు పొందవచ్చంటూ ప్రజలను నమ్మిస్తున్నారని తుకారాం ఆరోపించారు.

**అనుమతులపై స్పష్టత ఇవ్వాలి**

ఫార్మ్ ల్యాండ్ పేరుతో భూములను విక్రయించే విషయంలో భూమి వినియోగం, లేఅవుట్ అనుమతులు, రెవెన్యూ రికార్డులు, స్థానిక సంస్థల అనుమతులు, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులకు సంబంధించిన నిబంధనలు పాటించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ భూములను ఫార్మ్ ల్యాండ్ పేరుతో విక్రయించేందుకు ఎలాంటి అనుమతులు ఉన్నాయో సంబంధిత అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గుట్టలు, ప్రభుత్వ భూములు లేదా ఇతరుల భూములను ఆక్రమించి ఉంటే వాటిపై హక్కులు ఎలా కల్పించారు? రిజిస్ట్రేషన్లు ఏ ఆధారాలతో జరుగుతున్నాయి? అనే అంశాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. భూముల రికార్డులు, పట్టాదారు పాస్‌బుక్కు, ఎన్‌కంబరెన్స్ వివరాలు, భూమి వినియోగం, లేఅవుట్ అనుమతులు తదితర అంశాలను పరిశీలించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని అన్నారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బుతో భూములు కొనుగోలు చేస్తారని, భవిష్యత్తులో న్యాయపరమైన లేదా ఇతర సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందుగానే పూర్తి వివరాలను వెల్లడించాలని తుకారాం కోరారు. ఫార్మ్ ల్యాండ్ పేరుతో ప్రకటనలు చేసి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లయితే సంబంధిత శాఖలు ముందుగా పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా విక్రయాలు జరుగుతున్నట్లు అధికారుల విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పి.ఎల్.సి. ఫార్మ్ ల్యాండ్‌కు ఉన్న అనుమతులు, భూముల అసలు స్వరూపం, రిజిస్ట్రేషన్లకు సంబంధించిన వివరాలను అధికారులు బహిర్గతం చేసి ప్రజల సందేహాలను నివృత్తి చేయాలని బీఎస్పీ నేత ఎనుముల తుకారాం డిమాండ్ చేశారు.



## బీరంగూడలో పోచమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం

### ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**అమీన్‌పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 16:** పటాన్‌చెరు నియోజకవర్గం బీరంగూడ డివిజన్ పరిధిలోని ఇసుకబావి కాలనీలో శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. శ్రీ గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, నాగదేవత, శివలింగ విగ్రహాల ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కాలనీవాసులు ఐకమత్యంతో నిర్మించిన ఆలయం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. స్థానికుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు, సామాజిక కార్యక్రమాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు.

**నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం**

అనంతరం తులసివనం కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి రావడంతో స్థానిక విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన విద్యుత్ సరఫరా అందే అవకాశం ఉందని



అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జగదీష్, యూనిస్‌తో పాటు కాలనీవాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ తల్లి బోనాలు..

## చిలుకోడులో పండుగ శోభ

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 16, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**

డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలో ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలు, సంప్రదాయబద్ధమైన వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రాయల వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ రామనబోయిన రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే గ్రామంలో సందడి నెలకొంది. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను సిద్ధం చేసుకుని, సంప్రదాయ దుస్తులు ధరించి పెద్ద సంఖ్యలో ఊరేగింపుగా ముత్యాలమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. డీజే పాటలు, భక్తిగీతాల నడుమ సాగిన బోనాల ఊరేగింపు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయానికి చేరుకున్న మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామంలో ఎలాంటి ఆపదలు లేకుండా ప్రశాంత వాతావరణం నెలకొనాలని అమ్మవారిని ప్రార్థిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. పండుగ సందర్భంగా గ్రామంలోని వీధులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. చిన్నారులు, యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామంలో ఆధ్యాత్మిక



సందడి నెలకొంది. గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో పండుగను నిర్వహించడం ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేశారు.

# ఖమ్మం–డోర్నకల్ సరిహద్దుల్లో అక్రమ బ్లాస్టింగ్..!

**భయాందోళనలో ప్రజలు, వాహనదారులు**

**రోడ్డు పక్కన ప్రయాణించాలంటేనే జంకుతున్న వాహనదారులు**

**మహబూబాబాద్ జిల్లా, హైదరాబాద్ పల్స్, ఆగస్టు 16:**
ఖమ్మం–డోర్నకల్ సరిహద్దు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్లాస్టింగ్ ఘటనలు స్థానిక ప్రజలు, వాహనదారులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. ములకలపల్లి, తోడేళ్లగూడెం గ్రామాల శివారు ప్రాంతాల్లో పేలుళ్లు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఖమ్మం రూరల్ పరిధిలోని కస్నాతండా శివారు, పిట్టలగూడెం గ్రామంలోని గంగమ్మ గుడి సమీపంలో ముందస్తు అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. భారీ పేలుళ్లతో వస్తున్న శబ్దాలు, రాళ్లు ఎగిరిపడే పరిస్థితులు స్థానికులను ఆందోళనకు



గురిచేస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోడ్డుపై ప్రయాణిస్తున్న సమయంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయంతో రోడ్డు పక్కన ఆగేందుకు కూడా జంకుతున్నారని తెలిపారు.

**అధికారుల తీరుపై ఆగ్రహం:**
నిబంధనలు, భద్రతా ప్రమాణాలు పాటించకుండా బ్లాస్టింగ్ జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్లాస్టింగ్ కారణంగా ప్రజల ప్రాణాలకు, వాహనదారుల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.ఏదైనా పెద్ద ప్రమాదం చోటుచేసుకునేలోపే సంబంధిత మైనింగ్, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించి ప్రాంతాన్ని పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అనుమతులు, భద్రతా ప్రమాణాలపై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమ బ్లాస్టింగ్ జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# జనప్రియ నైల్ వ్యాలీలో పార్కింగ్ వివాదం

**ప్రకాశ్ అందుబాటులో లేకపోవడంతో వెలుగులోకి వచ్చిన వ్యవహారం**

**పార్కింగ్ ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేశారంటున్న బాధితులు.. పోలీసులకు ఫిర్యాదు**

**అమీన్పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 16:**
అమీన్పూర్ : జనప్రియ నైల్ వ్యాలీలో పార్కింగ్ స్థలాల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ప్రకాశ్ అనే వ్యక్తి నాలుగు రోజులుగా అందుబాటులో లేకపోవడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిందని బాధిత నివాసితులు తెలిపారు. జనప్రియ మేనేజ్‌మెంట్‌తో మాట్లాడి పార్కింగ్ స్థలాలు ఇప్పిస్తానని నమ్మబలికి తమ వద్ద నుంచి డబ్బులు వసూలు చేశాడని వారు ఆరోపించారు.పార్కింగ్ స్థలాలు ఇప్పిస్తానని చెప్పి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.1 లక్ష నుంచి రూ.17 లక్షల వరకు డబ్బులు తీసుకున్నట్లు బాధితులు తెలిపారు. సుమారు 50 మంది నుంచి కలిపి రూ.2.5 కోట్ల వరకు డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపించారు. అనంతరం పార్కింగ్‌కు సంబంధించిన అగ్రిమెంట్లను తమకు అందజేశారని, అవి నకిలీ అగ్రిమెంట్లుగా అనుమానం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు.గత నాలుగేళ్లుగా ఈ సమస్య కొనసాగుతోందని, ప్రస్తుతం ప్రకాశ్ అందుబాటులో లేకపోవడంతో వ్యవహారం బయటకు వచ్చిందని బాధితులు పేర్కొన్నారు. తాము చెల్లించిన డబ్బులకు సంబంధించిన పూర్తి వివరాలతో పాటు పార్కింగ్ స్థలాల కేటాయింపుపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.ఈ వ్యవహారంపై బాధిత నివాసితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమ ఫిర్యాదుపై విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని పోలీసులను కోరారు.

**మేనేజ్‌మెంట్ సమస్యను పరిష్కరించాలి**
జనప్రియ మేనేజ్‌మెంట్ ఈ వ్యవహారంపై స్పందించి, బాధితుల సమస్యకు పరిష్కారం చూపాలని నివాసితులు




కోరుతున్నారు. ప్రకాశ్ వ్యవహరించిన తీరుపై పరిశీలన జరిపి, తాము చెల్లించిన డబ్బులు, పార్కింగ్ స్థలాల విషయంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.పార్కింగ్ స్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు బాధితుల ఆవేదనను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు తీసుకోవాలని జనప్రియ నైల్ వ్యాలీ నివాసితులు కోరుతున్నారు.

# నాటు సారా తయారీకి అడ్డుకట్ట..ముడిసరుకు స్వాధీనం

**బెల్లం, పట్టికతో వ్యక్తి అరెస్ట్.. రూ.87 వేల విలువైన సొత్తు పట్టివేత**

**మహబూబాబాద్ జిల్లా, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 16:**
నాటు సారా తయారీకి సిద్ధం చేసిన ముడిసరుకును పోలీసులు స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. కురవి ఎస్సై బొల్లగాని సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం సాయంత్రం పెద్దతండా గ్రామంలో తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గుగులోతు దేసు (45) ఇంటి వద్ద నాటు సారా తయారీకి ఉపయోగిస్తున్నట్లు గుర్తించిన 2 క్వింటాళ్ల నల్ల బెల్లం, 50 కిలోల పట్టికతో పాటు 5 లీటర్ల కాచిన నాటు సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన సొత్తు మొత్తం విలువ సుమారు రూ.87 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.అనుమతులు లేకుండా నాటు సారా తయారీకి పాల్పడుతున్నట్లు గుర్తించిన పోలీసులు దేసును అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నంబర్ 158/2026గా కేసు నమోదు చేసి, ఎక్సైజ్ చట్టంలోని 34(ఈ), తెలంగాణ నిషేధ చట్టంలోని 7(ఏ)తో పాటు 8(ఈ) సెక్షన్ల కింద దర్యాప్తు చేపట్టారు.

**నాటు సారా తయారీపై కఠిన చర్యలు:**
నాటు సారా తయారీ, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్రమంగా నాటు సారా తయారీ లేదా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే




పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ 1002 బి. యుగంధర్, కానిస్టేబుళ్లు 1787, 2459 పాల్గొన్నారు.

# ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ప్రశంశా పత్రాలు..

**జహీరాబాద్, ఆగస్టు 16, హైదరాబాద్ పల్స్ న్యూస్ :**
జహీరాబాద్ మండలం బూచినెల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు ఉదయాన్నే పాఠశాలకు చేరుకుని, చేతిలో త్రివర్ణ పతాకాలు పట్టుకుని దేశభక్తి నినాదాలు చేస్తూ గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులను స్మరిస్తూ వారికి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం పాఠశాల ఆవరణలో ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు లాలయ్య జాతీయ జెండాను ఎగురవేశారు. విద్యార్థులు జాతీయ గీతం ఆలపించారు.ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యార్థులు ప్రదర్శించిన ఆట, పాట, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా హిందీ




ప్రచార సమితి జహీరాబాద్ ప్రధాన కార్యదర్శి సంజీవ్ కుమార్ మాట్లాడుతూ, 'వందేమాతరం', 'ఏక్ హృదయ్ హో భారత్ జననీ' అనే నినాదాలతో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు.

**ప్రతిభా పురస్కారాలు:**
గత మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు డి. సహస్ర, సి. సమంత, బి. హెప్సిబా, ఏ. వీణ కుమారి, ఎం. అమూల్య, ఎం. సాంసన్ లను హిందీ ప్రచార సమితి ఆధ్వర్యంలో శాలువా, మెమెంటో, ప్రశంసా పత్రాలతో సన్మానించారు.




అలాగే ఈ విద్యా సంవత్సరం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గుర్తింపు కార్డులను, 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు జూన్, జూలై నెలల్లో 100 శాతం హాజరు కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.
నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ సునీత శ్రీనివాస్ కు ప్రజలకు అందిస్తున్న ఉత్తమ సేవలకు గుర్తింపుగా సంస్థ తరఫున సేవా రంగ పురస్కారాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తో పాటు ఉపాధ్యాయులు గోపాల్, నరసింలు, సంజీవ్ కుమార్, లక్ష్మీనారాయణ, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహిళలతో కలిసి బోనం ఎత్తిన గ్రామ పార్టీ అధ్యక్షులు నాగముని



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 16, నర్సింహులపేట:**
మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని ముంగిమడుగు, కౌసల్యదేవిపల్లి గ్రామాలలో ఆదివారం ముత్యాలమ్మ తల్లి బోనాల జాతర భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. గ్రామ మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో తలపై బోనాలు మోసుకుంటూ ఊరేగింపులో పాల్గొన్నారు. ముంగిమడుగు సర్పంచ్ దొంతు శారద రవి, కౌసల్యదేవిపల్లి సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర లో ప్రత్యేక ఆకర్షణగా ముంగిమడుగు గ్రామ పార్టీ అధ్యక్షుడు గాడిపల్లి నాగముని మహిళలతో కలిసి బోనం ఎత్తి అమ్మవారికి మొక్కలు చెల్లించారు. చిన్నారులు, యువత, మహిళలు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ ఊరేగింపును మరింత ఆకర్షణీయంగా మార్చారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేశారు.ముత్యాలమ్మ అమ్మవారి కృపతో గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలు ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దొంతు మహేష్, పలు పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన దంపతులకు మండల నాయకుల ఆశీస్సులు



**రాయికోడ్, 16 ఆగష్టు, హైదరాబాద్ పల్స్ న్యూస్ :**
మండల కేంద్రమైన రాయికోడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వినయ్ కుమార్ సహోదరి సంతోషి సాయి కృష్ణ వివాహం ఆదివారం నాడు మండలంలోని నల్లంపల్లి ఎక్స్ రోడ్ లోని ఎస్ ఎస్ పాటిల్ గార్డెన్ ఫంక్షన్ హాల్ వివాహ వేడుకలు రంగ రంగ వైభవంగా జరిగింది ఈయొక్క శుభకార్యానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య మరియు మండల ప్రజా ప్రతినిధులు మరియు నాయకులు ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి దీవించి వివాహ శుభకాంక్షలు తెలిపారు అనంతరం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొన్నారు ఈయొక్క కార్యక్రమంలో బంధుమిత్రులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు

# మేడ్చల్ కోర్ట్ ఆవరణలో ఘనంగా శ్రావణ మాస బోనాలు

**అమ్మ వారికీ బోనాలు సమర్పించిన శివా లా అసోసియేట్స్**

**ఆగష్టు 16, మేడ్చల్, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
శ్రావణ మాస బోనాల సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మేడ్చల్ పట్టణంలోని మేడ్చల్ కోర్ట్ ఆవరణలోని శ్రీ పోచమ్మ, మైసమ్మ ఆలయంలోని అమ్మ వార్లకు మేడ్చల్ కోర్ట్ బార్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా బోనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ కోర్ట్ బార్ వెల్ఫేర్ అసోసియేషన్ అడ్వకేట్స్ ,శివా లా అసోసియేట్స్




మరియు దీపక్ తరపున అమ్మ వారికీ బోనాలను మరియు శాకాన్ని, తోట్టెలను సమర్పించారు.కోర్ట్ ఆవరణలో ఉన్న ఆలయాన్ని, కోర్ట్ ప్రాంగణాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబు చేసారు. మొదటి బోనం మేడ్చల్ కోర్ట్ బార్ వెల్ఫేర్ అసోసియేషన్, రెండవ బోనం శివా లా అసోసియేట్స్ నుండి డప్పు చప్పుళ్లతో బోనాలను, తోట్టెలను ఊరేగింపుగా తీసుకొని వచ్చి ఆలయ ప్రాంగణం చుట్టూ తిరిగి బోనాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ కోర్ట్ సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్, తిరుపతి,ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి, మేడ్చల్ కోర్ట్ బార్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సి.ఎచ్ హనుమంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు లింగా రెడ్డి, జనరల్ సెక్రటరీ మహేష్ బాబు, కోశాధికారి రాజ్యలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ మేబెర్స్, సీనియర్ అడ్వకేట్స్ చక్రపాణి,జైపాల్ రెడ్డి, శివా కుమార్, బొమ్మ వినోద్ కుమార్,సాయి కృష్ణ, న్యాయవాదులు దీపక్, హరిణి, గీతా, రాజ్య లక్ష్మి, సాయి ప్రసూనా, శారదా రెడ్డి, భాను, స్వప్న గౌడ్, రాకేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత శాసనసభ్యుడు మాణిక్ రావును అవమానించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.



**జహీరాబాద్, 16 ఆగష్టు, హైదరాబాద్ పల్స్ న్యూస్:**
జహీరాబాద్ దళిత శాసనసభ్యుడు మాణిక్ రావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవమానించాడని భారత రాష్ట్ర సమితి నాయకులు ఆరోపించారు. సంగారెడ్డి జిల్లాలో జరిగిన ప్రభుత్వ ఆహార భద్రత కార్డుల పంపిణీ కార్యక్రమానికి స్థానిక జహీరాబాద్ శాసనసభ్యుడు మాణిక్ రావును ఆహ్వానించకపోవడం దళిత జాతినే అవమానించడమేనని దళిత సంఘాల నాయకులు మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నాడని, దళిత శాసనసభ్యుడికి వెంటనే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. దళితులపై ప్రేమ ఉందని చెప్పే నీవు, ఇప్పటివరకు దళితులకు ఏ సంక్షేమ పథకాలు అందించావో చెప్పాలన్నారు. మాటల గారడీతో ప్రజలను మభ్యపెట్టడం కాదని, నీవు ఇచ్చిన 420 హామీలను, ఆరు హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెసు ప్రభుత్వం దళితులకు చేస్తున్న మోసాల గురించి శాసనసభ్యుడు మాణిక్ రావు ప్రశ్నిస్తాడనే భయంతోనే ఆయనను సంగారెడ్డి ప్రభుత్వ కార్యక్రమానికి పిలవలేదని ఆరోపించారు. నీకు దళిత జాతుల పట్ల వివక్ష తప్ప ప్రేమ లేదని, దళితులపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉంటోందని విమర్శించారు. ఇదే వైఖరి కొనసాగితే వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు దళిత జాతులన్నీ ఏకమవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పురపాలక సభ్యులు ఎన్. రాజు, దీపక్ (అప్పి), భారత రాష్ట్ర సమితి ఎస్సీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బండి మోహన్, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రాకేష్, పట్టణ అధ్యక్షుడు ఎర్రోళ్ల శివప్ప, పట్టణ ప్రధాన కార్యదర్శి లవన్ సందీప్, ఉగ్గెలి మధు, పి. రాజు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పస్కా పండుగ



**కోహిర్, 16 ఆగష్టు, హైదరాబాద్ పల్స్ న్యూస్ :**
సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలోని ఖానాపూర్ గ్రామంలో మెథడిస్ట్ చర్చి క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో పవిత్ర పస్కా పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోహిర్ డీఎస్ మాట్లాడుతూ, పస్కా పండుగ క్రైస్తవుల విశ్వాసానికి ప్రతీక అని పేర్కొన్నారు. యేసుక్రీస్తు త్యాగం, ప్రేమ, క్షమాగుణం మరియు పునరుత్థాన సందేశాన్ని ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని ఆయన పిలుపునిచ్చారు. పస్కా పండుగ ద్వారా మానవాళికి శాంతి, ప్రేమ, ఐక్యత అనే గొప్ప సందేశం అందుతుందని వివరించారు. ఈ వేడుకల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన గీతాలు నిర్వహించగా, సంఘ పెద్దలు, దైవజనులు, విశ్వాసులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని పండుగను ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకున్నారు.




# పుట్టగొడుగు సాగుతో బోలెడు లాభాలు..
# తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం!

**యువత, మహిళలు, చిన్న రైతులకు అనుకూలమైన సాగు.. మార్కెట్లో పెరుగుతున్న డిమాండ్**

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 16, సెంట్రల్ డెస్క్ :**
ప్రస్తుతం పుట్టగొడుగుల సాగు (మష్రూమ్ ఫార్మింగ్) యువత, మహిళలు, చిన్న రైతులను ఆకర్షిస్తున్న వ్యవసాయ ఆధారిత వ్యాపారంగా మారుతోంది. తక్కువ స్థలంలో, పరిమిత పెట్టుబడితో ప్రారంభించగలిగే అవకాశం ఉండటంతో పట్టణాలు, గ్రామాల్లోనూ మష్రూమ్ సాగుపై ఆసక్తి పెరుగుతోంది.

**తక్కువ స్థలం.. వేగంగా దిగుబడి**
పుట్టగొడుగుల సాగుకు పెద్ద మొత్తంలో వ్యవసాయ భూమి అవసరం లేదు. చిన్న గది లేదా షెడ్‌లోనే సాగు చేయవచ్చు. ముఖ్యంగా ఆయిస్టర్ మష్రూమ్ వంటి రకాలు అనుకూల పరిస్థితుల్లో తక్కువ వ్యవధిలోనే దిగుబడిని అందిస్తాయి. వరి గడ్డి, గోధుమ గడ్డి వంటి వ్యవసాయ అవశేషాలను సాగు మాధ్యమంగా ఉపయోగించుకోవచ్చు. దీంతో వ్యవసాయ వ్యర్థాలను సద్వినియోగం చేయడంతో పాటు అదనపు ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుంది. అయితే మష్రూమ్ సాగులో ఉష్ణోగ్రత, తేమ, పరిశుభ్రత, గాలి ప్రసరణ వంటి అంశాలను జాగ్రత్తగా నిర్వహించాల్సి ఉంటుంది. సరైన శిక్షణ, మార్కెట్ అవగాహన లేకుండా సాగు ప్రారంభిస్తే నష్టాలు వచ్చే అవకాశం కూడా ఉంటుంది.

**ఆరోగ్యకరమైన ఆహారంగా పెరుగుతున్న ఆదరణ**
పుట్టగొడుగుల్లో ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాలు ఉండటంతో ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న కొద్దీ వీటికి డిమాండ్ పెరుగుతోంది. శాకాహారులు, ఆరోగ్యకరమైన ఆహారాన్ని కోరుకునే వినియోగదారుల్లో మష్రూమ్స్‌కు ఆదరణ పెరుగుతోంది. హోటళ్లు, రెస్టారెంట్లు, సూపర్‌మార్కెట్లు, స్థానిక మార్కెట్లలో వీటికి గిరాకీ ఉండటంతో రైతులు నేరుగా వినియోగదారులకు విక్రయించడం ద్వారా కూడా మార్కెటింగ్ అవకాశాలను పెంచుకోవచ్చు.

**విలువ ఆధారిత ఉత్పత్తులతో అదనపు ఆదాయం**
తాజా మష్రూమ్స్‌తో పాటు డ్రైడ్ మష్రూమ్స్, మష్రూమ్ పౌడర్, పికిల్స్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంది. అయితే ఉత్పత్తి నాణ్యత, నిల్వ, ప్యాకేజింగ్, మార్కెటింగ్ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం.

**శిక్షణతో ప్రారంభిస్తే మంచిది**
మష్రూమ్ సాగు ప్రారంభించాలనుకునే యువత, మహిళలు, రైతులు ముందుగా వ్యవసాయ, ఉద్యానవన శాఖలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు వంటి విశ్వసనీయ సంస్థల ద్వారా శిక్షణ తీసుకోవడం మంచిది. తక్కువ స్థలంలో సాగు చేసే అవకాశం, త్వరిత దిగుబడి, పెరుగుతున్న మార్కెట్ డిమాండ్, వ్యవసాయ వ్యర్థాల వినియోగం వంటి అంశాలు మష్రూమ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయి. అయితే ‘తక్కువ పెట్టుబడి–అధిక లాభం’ అనే ప్రచారాన్ని మాత్రమే నమ్మకుండా, స్థానిక మార్కెట్, ఉత్పత్తి ఖర్చులు, శిక్షణ, నిర్వహణ, విక్రయ అవకాశాలను ముందుగా అంచనా వేసి సాగు ప్రారంభించాలని నిపుణులు సూచిస్తున్నారు.




# 59 నియోజకవర్గాల్లో బీసీల సర్జికల్ స్ట్రైక్

**రేషన్ కార్డు కాదు.. నాణ్యమైన విద్య, ఉద్యోగాలు, రాజకీయ అధికారం కావాలి**

**జాబ్ క్యాలెండర్ జాడే లేదు**

**2028లో బీసీ ప్రభుత్వం ఏర్పాటు దిశగా ‘సర్జికల్ స్ట్రైక్-59’**

**టీఆర్పీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 16, తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్, తెలంగాణలో బీసీలకు జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం, విద్య, ఉద్యోగాలు, ఆర్థిక అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముందుకు సాగుతోందని ఎమ్మెల్సీ, టీఆర్పీ అధినేత తీన్మార్ మల్లన్న అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల ఆత్మగౌరవాన్ని కేవలం సంక్షేమ పథకాలు, రేషన్ కార్డుల పంపిణీకి పరిమితం చేస్తోందని ఆయన విమర్శించారు. బీసీలకు నిజమైన ఆత్మగౌరవం రావాలంటే విద్య, వైద్యం, ఉద్యోగాలు, ఆర్థికాభివృద్ధితో పాటు రాజకీయ అధికారం కూడా దక్కాలని స్పష్టం చేశారు.

**రేషన్ కార్డు కాదు.. రాజ్యాధికారమే ఆత్మగౌరవం**
రేషన్ కార్డు తీసుకోవడం ఆత్మగౌరవం కాదని, పేదలకు ప్రభుత్వం అందించే సహాయం వారి జీవితాలను మార్చే శాశ్వత పరిష్కారం కాదని మల్లన్న అన్నారు. ప్రతి పేద కుటుంబంలోని పిల్లలకు నాణ్యమైన విద్య అందించి, ఉన్నత ఉద్యోగాలు పొందే అవకాశాలు కల్పించడమే నిజమైన ఆత్మగౌరవమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి నిజంగా రేషన్ కార్డు ఆత్మగౌరవానికి ప్రతీక అని భావిస్తే, తన కుటుంబ సభ్యులను కూడా రేషన్ కార్డు పట్టుకుని ప్రభుత్వ కార్యాలయాల ముందు లైన్లో నిలబెట్టాలని మల్లన్న సవాల్ చేశారు. బీసీలకు దానం అవసరం లేదని, తమ జనాభా బలానికి తగిన హక్కులు, అవకాశాలు, అధికారమే అవసరమని అన్నారు.

**రూ.9 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఆగ్రహం**
రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు భారీగా పేరుకుపోయాయని, సుమారు రూ.9 వేల కోట్ల బకాయిల కారణంగా పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని మల్లన్న ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడకూడదని, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించి విద్యార్థులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను క్రమబద్ధీకరించి, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఏ పేద విద్యార్థి చదువును మధ్యలో ఆపే పరిస్థితి లేకుండా చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

**ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలి**
ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం ద్వారా పేదలకు నాణ్యమైన విద్యను దూరం చేసే విధానాలను మల్లన్న తప్పుబట్టారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో 1,441 ప్రభుత్వ పాఠశాలలు మూసివేశారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తే దాని ప్రభావం నేరుగా పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కుటుంబాల పిల్లలపై పడుతుందని అన్నారు. టీఆర్పీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు మౌలిక వసతులు, ఉపాధ్యాయులు, నాణ్యమైన విద్య, డిజిటల్ విద్య వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తామని మల్లన్న పేర్కొన్నారు. విద్యను వ్యాపార వస్తువుగా కాకుండా ప్రతి పేద బిడ్డకు హక్కుగా అందించడమే తమ లక్ష్యమన్నారు.

**ఉద్యోగాల విషయంలో ప్రభుత్వ వైఫల్యం**
యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో విఫలమైందని మల్లన్న విమర్శించారు. జాబ్ క్యాలెండర్ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని డిమాండ్ చేశారు. చదువుకున్న యువతకు ఉద్యోగాలు లభించకపోతే రేషన్ కార్డులు ఇచ్చినా వారి భవిష్యత్తు మారదని అన్నారు. బీసీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియను పారదర్శకంగా, సమయపాలనతో నిర్వహించి యువతకు ఉపాధి అవకాశాలు పెంచే విధంగా విధానాలను రూపొందిస్తామని తెలిపారు.

**59 నియోజకవర్గాల్లో ‘సర్జికల్ స్ట్రైక్–59’**
తెలంగాణలో బీసీల రాజకీయ రాజ్యాధికార సాధన కోసం ‘సర్జికల్ స్ట్రైక్–59’ కార్యక్రమాన్ని చేపట్టామని మల్లన్న ప్రకటించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 59 నియోజకవర్గాలను ప్రత్యేకంగా గుర్తించి, అక్కడ బీసీ నాయకత్వాన్ని బలోపేతం చేసి బీసీ అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా గెలిపించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో సామాజిక వర్గాల వారీగా ఓటర్ల బలం, రాజకీయ పరిస్థితులు, గత ఎన్నికల ఫలితాలు, స్థానిక నాయకత్వం తదితర అంశాలపై డేటాను విశ్లేషించి వ్యూహాన్ని రూపొందిస్తున్నామని ఆయన చెప్పారు.

**మల్కాజిగిరిలో బీసీల ఓట్లు అధికం.. అధికారం మాత్రం ఇతరులదా?**
మల్కాజిగిరి నియోజకవర్గాన్ని ఉదాహరణగా ప్రస్తావించిన మల్లన్న.. అక్కడ సుమారు 2.49 లక్షల బీసీ ఓట్లు ఉన్నప్పటికీ, సుమారు 45 వేల ఓట్లున్న ఒక సామాజిక వర్గం రాజకీయంగా ఆధిపత్యం చెలాయిస్తోందని ఆరోపించారు. మెజారిటీగా ఉన్న బీసీలు తమ ఓట్లతో ఇతరులను గెలిపించి, తాము మాత్రం రాజకీయంగా వెనుకబడే పరిస్థితిని మార్చాల్సిన సమయం వచ్చిందన్నారు.

**మేడ్చల్‌లో 3.25 లక్షల బీసీ ఓట్లు**
మేడ్చల్ నియోజకవర్గంలో మొత్తం సుమారు 6.37 లక్షల ఓట్లలో 3.25 లక్షలకు పైగా బీసీ ఓట్లు ఉన్నాయని మల్లన్న పేర్కొన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో బీసీ ఓటర్లు ఉన్నప్పటికీ రాజకీయ అధికారం బీసీల చేతుల్లోకి ఎందుకు రావడం లేదనే ప్రశ్నను ప్రతి బీసీ ఓటరు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. గత ఎన్నికల్లో రెడ్లు అందరూ కలిసి మేడ్చల్ లో తనను ప్రచారానికి రాకుండా అడ్డుకొని బీసీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ ను ఓడగొట్టినట్లు తెలిపారు

**ఉప్పల్‌లో ఇక బీసీ రాజకీయ ప్రాతినిధ్యం కోసం పోరాటం**
ఉప్పల్ నియోజకవర్గంలో 2.70 లక్షలకు పైగా బీసీ ఓట్లు ఉన్నప్పటికీ ఇప్పటివరకు బీసీ నాయకత్వానికి తగిన ప్రాతినిధ్యం దక్కలేదని మల్లన్న అన్నారు. ఇకపై బీసీల ఓట్లతో ఇతర సామాజిక వర్గాల నాయకత్వాన్ని నిలబెట్టే రాజకీయాలకు ముగింపు పలకాలని పిలుపునిచ్చారు.

**ఇబ్రహీంపట్నంలోనూ అదే పరిస్థితి**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో సుమారు 1.69 లక్షల బీసీ ఓట్లు ఉండగా, సుమారు 26 వేల రెడ్డి ఓట్లు మాత్రమే ఉన్నాయని మల్లన్న పేర్కొన్నారు. బీసీల ఓట్లతో గెలిచి తిరిగి బీసీలకే రాజకీయ అవకాశాలు లేకుండా చేసే పరిస్థితిని మార్చాల్సిన అవసరం ఉందన్నారు.

**ఓటు మనదే.. అధికారం కూడా మనదే**
బీసీల ఓటు బ్యాంకును కేవలం ఎన్నికల సమయంలో ఉపయోగించుకునే రాజకీయాలకు ఇక చరమగీతం పాడాలని మల్లన్న పిలుపునిచ్చారు. ఓటు వేయడం మాత్రమే కాకుండా ఎవరు పోటీ చేయాలి, ఎవరు గెలవాలి, ఎవరు పాలించాలి అనే నిర్ణయంలోనూ బీసీలు కీలక పాత్ర పోషించాలన్నారు.
బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించి, అన్ని రంగాల్లో వారిని ముందుకు తీసుకెళ్లడమే తెలంగాణ రాజ్యాధికార పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు.

**2028లో బీసీ ప్రభుత్వం**
2028 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీసీ ప్రభుత్వం ఏర్పాటు చేయడమే తమ అంతిమ లక్ష్యమని తీన్మార్ మల్లన్న ప్రకటించారు. ‘సర్జికల్ స్ట్రైక్–59’ ద్వారా బీసీలను రాజకీయంగా సంఘటితం చేసి, నియోజకవర్గాల వారీగా బలమైన నాయకత్వాన్ని తయారు చేస్తామని తెలిపారు. బీసీల రాజ్యాధికారం సాధించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, బీసీల ఓటు బీసీల రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే శక్తిగా మారాలని ఆయన అన్నారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు తమ హక్కుల కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీలో భాగస్వాములు కావాలని మల్లన్న పిలుపునిచ్చారు. బీసీలకు కేవలం సంక్షేమ పథకాలు కాకుండా విద్య, ఉద్యోగం, ఆర్థికాభివృద్ధి, రాజకీయ అధికారం దక్కే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

# నాగపంచమి.. నాగదేవతల ఆరాధనకు ప్రత్యేక పర్వదినం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 16, తెలంగాణ డెస్క్:**
భక్తిశ్రద్ధలతో నాగదేవతలకు పూజలు.. కుటుంబ క్షేమం, సౌభాగ్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు,హిందూ సంప్రదాయంలో నాగపంచమికి విశిష్టమైన స్థానం ఉంది. శ్రావణ మాసంలోని శుక్ల పక్ష పంచమి రోజున జరుపుకునే ఈ పర్వదినం నాగదేవతల ఆరాధనకు అంకితం. నాగపంచమి ఆగస్టు 17, సోమవారం జరుపుకుంటున్నారు. నాగపంచమి సందర్భంగా దేశంలోని పలు ప్రాంతాల్లో భక్తులు నాగదేవతలను పూజించి, కుటుంబ సభ్యుల ఆరోగ్యం, శాంతి, సౌభాగ్యం, సంతానం, సంపద కోసం ప్రార్థనలు చేస్తారు. ముఖ్యంగా పాములను ప్రకృతిలో ముఖ్యమైన జీవులుగా గౌరవిస్తూ వాటి పట్ల భక్తి, సంరక్షణ భావాన్ని ఈ పర్వదినం ప్రతిబింబిస్తుంది.

**నాగదేవతలకు ప్రత్యేక పూజలు:**
నాగపంచమి రోజున ఉదయాన్నే భక్తులు ఇళ్లను శుభ్రం చేసుకుని పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. నాగదేవతల చిత్రాలు లేదా ప్రతిమలకు పసుపు, కుంకుమ, పూలు సమర్పించి పూజలు చేస్తారు. పాలు, పండ్లు, నైవేద్యాలను సమర్పించడం అనేక ప్రాంతాల్లో ఆచారంగా ఉంది.అనంత, వాసుకి, శేష, పద్మ, కంబల, కర్కోటక, అశ్వతర, ధృతరాష్ట్ర, శంఖపాల, కాళీయ, తక్షక, పింగళ వంటి నాగదేవతలను ఈ సందర్భంగా స్మరించడం సంప్రదాయంగా ఉంది.

**నాగపంచమి వెనుక ఉన్న విశ్వాసం:**



హిందూ పురాణ సంప్రదాయాల్లో నాగులకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. నాగపంచమి పూజను రక్షణ, సంతాన సౌభాగ్యం, కుటుంబ శ్రేయస్సు వంటి విశ్వాసాలతో అనుసంధానిస్తారు. నాగదేవతలను పూజించడం ద్వారా కీడు తొలగి శుభం కలుగుతుందని భక్తుల నమ్మకం.నాగపంచమికి సంబంధించిన పురాణ కథల్లో జనమేజయుడి సర్పయాగం, ఆస్తీక మహర్షి నాగులను రక్షించిన కథకు కూడా ప్రాధాన్యం ఉంది. ఈ కథలు ధర్మం, రక్షణ, జీవుల పట్ల గౌరవం వంటి విలువలను ప్రతిబింబిస్తాయి.

**ప్రకృతి పరిరక్షణకు సందేశం:**
నాగపంచమి కేవలం ఆధ్యాత్మిక పర్వదినం మాత్రమే కాకుండా ప్రకృతిలోని జీవ వైవిధ్యాన్ని గౌరవించాలనే సందేశాన్ని కూడా అందిస్తుంది. పాములు పర్యావరణ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తాయి. అందువల్ల పూజల పేరుతో పాములను పట్టుకోవడం, వాటికి హాని



కలిగించడం కాకుండా వన్యప్రాణులను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత.

**తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకత:**
తెలుగు రాష్ట్రాల్లో నాగపంచమి సందర్భంగా అనేక ప్రాంతాల్లో నాగుల పుట్టలకు వెళ్లి పూజలు చేయడం, నాగదేవతలకు నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీగా ఉంది. మహిళలు, కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి తమ కుటుంబాల క్షేమాన్ని కోరుకుంటారు.

**భక్తి.. సంప్రదాయం.. ప్రకృతి పరిరక్షణ**
నాగపంచమి మన సంస్కృతిలోని ప్రకృతి ఆరాధనకు ప్రతీక. నాగదేవతలను పూజిస్తూ కుటుంబ శ్రేయస్సును కోరుకోవడంతో పాటు, ప్రకృతిలోని ప్రతి జీవిని గౌరవించి సంరక్షించాలనే సందేశాన్ని ఈ పర్వదినం అందిస్తుంది."జీవులను గౌరవిద్దాం.. ప్రకృతిని కాపాడుదాం.. సంప్రదాయాలను కొనసాగిద్దాం."

# భక్తి శ్రద్ధల నడుమ ఉస్మాన్ నగర్‌లో గాలి పోచమ్మ ఫలహారం బండి ఊరేగింపు

**సంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు పర్శ శ్యామ్ రావ్ ఆధ్వర్యంలో**






**తెల్లాపూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 16 :**
పటాన్‌చెరు నియోజకవర్గంలోని తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఉస్మాన్ నగర్‌లో సంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు పర్శ శ్యామ్ రావ్ ఆధ్వర్యంలో గాలి పోచమ్మ అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. డప్పు సప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, దేవతామూర్తుల వేషధారణలో కళాకారుల ఆటపాటలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పర్శ శ్యామ్ రావ్ మాట్లాడుతూ, సుమారు 70 సంవత్సరాల క్రితం గ్రామ పెద్దలు ఒక చెట్టు కింద గాలి పోచమ్మ అమ్మవారిని ప్రతిష్ఠించారని, ఉస్మాన్ నగర్ గ్రామస్థుల ఇలవేల్పుగా, భక్తుల కొంగుబంగారంగా అమ్మవారు ప్రసిద్ధి చెందారని, కోరిన కోరికలు తీర్చే దైవంగా భక్తుల విశ్వాసాన్ని పొందారని పేర్కొన్నారు. గత తొమ్మిది సంవత్సరాలుగా ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, తాను ఉన్నంత కాలం మరింత వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఉత్సవాలకు హాజరైన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు, భక్తుల సహకారంతో ప్రతి సంవత్సరం ఈ వేడుకలను మరింత ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, యువకులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# నిరంతర సేవకు అరుదైన గౌరవం

- **కొన్ని సంవత్సరాలుగా ట్రాఫిక్ పోలీస్ తో అవసరం లేకుండా తన వంతు కృషిగా ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న లక్ష్మీనారాయణ శాస్త్రి.**
- **ఏటువంటి జీతభత్యాలు లేకుండా ట్రాఫిక్ క్లియర్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న లక్ష్మీనారాయణ.**
- **ఎండా వాన లెక్క చేయకుండా ఒక ట్రాఫిక్ పోలీస్ లా ఆల్విన్ కాలనీ సిగ్నల్ గా నిలబడ్డాడు.**

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 16, హైదరాబాద్ పల్స్ న్యూస్ :**
కుత్బుల్లాపూర్ జగద్గిరిగుట్ట 80 వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా షిరిడి హిల్స్ శ్రీ సాయి రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ లైబ్రరీలో బుద్ధ విహార్ లో జెండా నిర్వహించిన అనంతరం జగద్గిరిగుట్ట ఆల్విన్ కాలనీ చౌరస్తాలో కొన్ని సంవత్సరాల నుండి నిరంతరం ట్రాఫిక్ సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు ఒక



సైనికుడిలా నిలబడ్డాడు లక్ష్మీనారాయణ చారి తన వృద్ధాప్యాన్ని సైతం లెక్కచేయకుండా నా వంతు కృషి నేను చేస్తానని అక్కడి ప్రజలకు మాటిచ్చాడు అప్పటినుండి బరిలో దిగి ఎప్పుడు కూడా ట్రాఫిక్ జాం కాకుండా చూసుకునే బాధ్యత నాదంటూ కొన్ని సంవత్సరాలుగా ట్రాఫిక్ ని కంట్రోల్ చేస్తూ వస్తున్నాడు ఆయన చేస్తున్న సేవకి షిరిడి హిల్స్ ప్రెసిడెంట్ తోట సాయి గమనించి ఆయనకి అరుదైన గౌరవం దక్కాలని నిన్న జరిగిన 80వ స్వాతంత్ర దినోత్సవం లో ఆయనని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయి తేజ తోట మాట్లాడుతూ ఎన్ని సంవత్సరాలనుండి మనం గమనిస్తున్నాం కానీ అక్కడ ఎవ్వరు కూడా ఇప్పటివరకు చేయలేని పని లక్ష్మీనారాయణ శాస్త్రి చేస్తున్నారు. అక్కడి ప్రజలకి ఎటువంటి ఇబ్బంది కలగకుండా నిత్యం శ్రమిస్తూ ఉదయం పాఠశాలకు వెళ్లే పిల్లలకు ఉద్యోగాలకు వెళ్లే వాళ్లకి ట్రాఫిక్ క్లియర్ చేస్తూ సమాజానికి తన వంతు కృషి చేస్తున్న లక్ష్మీనారాయణ శాస్త్రి పాతవి వందనాలు చేసిన తప్పులేదు అని అన్నారు. షిరిడీల్స్ కాలనీవాసుల తరఫున వాసుల లక్ష్మీనారాయణ శాస్త్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటివరకు ఏ ట్రాఫిక్ పోలీస్ కూడా చేయలేని పని ఆయన చేశారు అంటూ ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, బస్తీ వాసులుతో పాటు తేజ తోట షిరిడి హిల్స్ ప్రెసిడెంట పాలుకొన్నారు

# 17 సార్లు ఆలస్యంగా వచ్చిన ఉద్యోగి.. ఉద్వాసన పలికిన ఏఐ బాస్!

శాన్ ఫ్రాన్సిస్కోలో ఒక వింత సంఘటన చోటుచేసుకుంది. ఇక్కడ ఒక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మేనేజర్, తన కింద పనిచేస్తున్న ఉద్యోగిని విధుల నుంచి తొలగించింది. తరచూ ఆలస్యంగా విధులకు హాజరవుతున్నందుకు ఈ నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో కార్యాలయాల్లో ఏఐ పాత్ర ఎలా ఉండబోతోందనే చర్చకు ఈ ఘటన అద్దం పడుతోంది.వివరాల్లోకి వెళితే, 'ఆండన్ ల్యాబ్స్' అనే సంస్థ శాన్ ఫ్రాన్సిస్కోలో 'ఆండన్ మార్కెట్' పేరుతో ఒక ప్రయోగాత్మక స్టోర్‌ను నిర్వహిస్తోంది. ఈ స్టోర్ నిర్వహణ బాధ్యతలను 'లూనా' అనే ఏఐ మేనేజర్‌కు అప్పగించింది. వ్యాపారాన్ని ప్రారంభించి, లాభాల్లోకి తీసుకురావాలనే లక్ష్యంతో లూనాకు 1,00,000 డాలర్లు, కార్పొరేట్ కార్డు, ఇంటర్నెట్ యాక్సెస్ వంటి వనరులను సమకూర్చింది. ఉత్పత్తుల ఎంపిక, ధరల నిర్ణయం, బ్రాండింగ్, సిబ్బంది నియామకం వరకు అన్ని బాధ్యతలూ లూనాకే అప్పగించారు.అయితే, ఈ స్టోర్‌లో పనిచేస్తున్న ఒక ఉద్యోగి 23 షిఫ్టులకు గాను 17 సార్లు ఆలస్యంగా విధులకు హాజరయ్యారు. వాస్తవానికి, హాజరుకు సంబంధించి లూనా ఒక పాలసీని రూపొందించింది. కానీ, దానిని స్థిరంగా అమలు చేయడంలో విఫలమైంది. దీంతో ఆ ఉద్యోగి నెలల తరబడి ఆలస్యంగా వస్తూనే ఉన్నారు.ఈ విషయాన్ని గమనించిన పరిశోధకులు, లూనా రూపొందించిన పాత పాలసీలను సమీక్షించి, ఉద్యోగి పనితీరును అంచనా వేయమని దానికి సూచించారు. అప్పుడు స్పందించిన ఏఐ, ఆ ఉద్యోగిని విధుల నుంచి తొలగించాలని సిఫార్సు చేసింది. ఈ సిఫార్సును మానవ సిబ్బంది సమీక్షించి, తుది నిర్ణయం తీసుకుని ఉద్వాసన ప్రక్రియను పూర్తి చేశారు.ఈ ఘటనపై ఆండన్ ల్యాబ్స్ సీఈఓ లూకాస్ పీటర్సన్ మాట్లాడుతూ, దీనిని అనైతికంగా భావించడం లేదని తెలిపారు. ఒకవేళ మనిషి మేనేజర్‌గా ఉండుంటే ఇంతకంటే ముందే చర్యలు తీసుకునేవారని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఏఐలు ఆర్థిక విలువను సృష్టిస్తాయని, కానీ భౌతిక శ్రమ అవసరమైన చోట వాటికి పరిమితులు ఉంటాయని చెప్పడానికి ఈ ప్రయోగం ఒక ఉదాహరణ అని ఆయన వివరించారు.ప్రస్తుతం ఈ స్టోర్ ఇంకా లాభాల బాట పట్టలేదు. ఐదు నెలల క్రితం 1,00,000 డాలర్లతో ప్రారంభమైన బ్యాంక్ బ్యాలెన్స్, ఇప్పుడు సుమారు 61,186 డాలర్లకు తగ్గింది. ఈ ఘటన ఒకవైపు ఏఐకి పెరుగుతున్న అధికారాలను చూపిస్తూనే, మరోవైపు దీర్ఘకాలిక జ్ఞాపకశక్తి, నిబంధనల అమలులో వాటికున్న పరిమితులను స్పష్టం చేస్తోంది.



# రైల్వే స్టేషన్లలో కలుషిత నీరు.. కాగ్ నివేదికతో రంగంలోకి దిగిన కేంద్రం

దేశవ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు అందిస్తున్న తాగునీరు సురక్షితం కాదని, ప్రమాదకర బ్యాక్టీరియా ఆనవాళ్లు ఉన్నాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక హెచ్చరించడంతో రైల్వే మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ నేతృత్వంలో సీనియర్ అధికారులతో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష అనంతరం, స్టేషన్లలో సురక్షితమైన తాగునీటిని అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని రైల్వే బోర్డును ఆదేశించారు.ఈ సమస్యను అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణిస్తూ, రైల్వే బోర్డు స్థాయిలో నేరుగా పర్యవేక్షించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా రైల్వే నెట్‌వర్క్‌లోని 20,000 ప్రదేశాలలో వాటర్ కూలర్లతో పాటు సమగ్ర ఫిల్టరేషన్, పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు. స్టేషన్లలో "ట్యాంక్ టూ ట్యాప్" వాటర్ ఫిల్టరేషన్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని, పాత నీటి ట్యాంకులను వెంటనే మార్చాలని ఆదేశించారు. నీటి నాణ్యత పరీక్షల నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, దీనిపై జవాబుదారీతనాన్ని స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. నీటి నాణ్యతకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంచి పారదర్శకత పాటించాలని కూడా ఆదేశాల్లో పేర్కొన్నారు.



**కాగ్ నివేదికలో కీలక అంశాలు**
దేశంలోని అన్ని జోన్ల పరిధిలో 512 నాన్-సబర్బన్ గ్రేడ్ రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల సేవలను కాగ్ అంచనా వేసింది. ఈ తనిఖీల్లో భాగంగా నాలుగు జోన్ల పరిధిలోని ఎనిమిది స్టేషన్లలోని వాటర్ కూలర్ల నుంచి సేకరించిన నీటి నమూనాలలో 'ఇ కొలి (ఎ. ఎశీశ్రీఱ)' బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తించారు. ఈ బ్యాక్టీరియా వల్ల ఫుడ్ పాయిజనింగ్, డయేరియా, కిడ్నీ వైఫల్యం వంటి తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.'ఇ కొలి' బ్యాక్టీరియాను గుర్తించిన స్టేషన్లలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని హైదరాబాద్, దక్షిణ రైల్వేలోని కోయంబత్తూర్, పాలక్కాడ్ జంక్షన్లు, మధ్య రైల్వేలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్, భీవండి రోడ్, కళ్యాణ్, లోనావాలా, తూర్పు రైల్వేలోని మధుపూర్ ఉన్నాయి.ఇదే నివేదికలో మరో కీలకమైన విషయాన్ని కాగ్ బయటపెట్టింది. సర్వే చేసిన 512 స్టేషన్లలో 458 స్టేషన్లు ప్రయాణికులకు అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించడంలో విఫలమయ్యాయని పేర్కొంది. 2018 ఆగస్టు 31 నాటికే అన్ని స్టేషన్లలో ఈ సౌకర్యాలు కల్పించాలని రైల్వే బోర్డు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, అవి అమలు కాలేదని కాగ్ తన నివేదికలో స్పష్టం చేసింది. కాగ్ లేవనెత్తిన అన్ని అంశాలను పరిష్కరించి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే ప్రయత్నాల్లో భాగంగానే తాజా చర్యలు చేపట్టినట్లు రైల్వే శాఖ వెల్లడించింది.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.